teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 408 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 21 జూన్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## జీవో 46 బాధితుల పక్షాన పోరాడుతాం

**బీఆర్ఎస్ పార్టీ బాధితులకు మద్దతుగా నిలుస్తుంది**

**బాధితులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం**

హైదరాబాద్, జూన్ 20 (తీన్మార్ న్యూస్): జీవో 46 బాధితుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ తప్పకుండా పోరాటం చేస్తుందని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. జీవో 46 బాధితులు గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మేము అధికారంలో ఉన్నప్పుడు జీవో 46 సవరిద్దామన్న ప్రయత్నం ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయింది. ఇప్పుడు మీకు న్యాయం దక్కేవరకు బీఆర్ఎస్ పార్టీ తరపున తప్పకుండా పోరాడుతాం. మా నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి.. జీవో 46 బాధితుల తరపున పోరాడుతున్నాడని కేటీఆర్ తెలిపారు.





## జూన్ 21న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

**ఆగస్టు 15లోగా రైతు పంట రుణాల మాఫీకి నిర్ణయం**

**ఇదే అంశంపై కేబినెట్ భేటీలో చర్చించే అవకాశాలు**

**నిధుల సేకరణ అంశంపై మంత్రివర్గంలో కీలక చర్చ**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జూన్ 21న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సచివాలయంలో జరగనుంది. ఆగస్టు 15లోగా రైతు పంట రుణాల మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ప్రధానంగా ఇదే అంశంపై కేబినెట్ భేటీలో చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

హైదరాబాద్, జూన్ 20 (తీన్మార్ న్యూస్): రుణమాఫీకి సుమారు రూ. 30 వేల కోట్లు, రైతు భరోసాకు మరో రూ. 7 వేల కోట్లు అవసరమవడంతో నిధుల సేకరణ ఎలా అనే అంశంపైనా మంత్రివర్గంలో చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నారు. అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ రూపకల్పన, పంటల బీమాపైనా కేబినెట్ చర్చించనున్నట్లు

మిగతా 2 లో



# బీఆర్ఎస్‌లో అంతర్గత అలజడి

## పార్టీ నేతల్లో రాజకీయ భవిష్యత్‌పై ఆందోళన

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆకర్ష్ అస్త్రం ప్రభావం**

**ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నారంటూ జోరుగా ప్రచారం**

**బీఆర్ఎస్ హైకమాండ్ బుజ్జగించేందుకు ప్రయత్నాలు**




భారత రాష్ట్ర సమితిలో అంతర్గతంగా అలజడి రేగుతోంది. పలువురు పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారన్న ప్రచారం జరుగుతూండటమే దీనికి కారణం.

తెలంగాణ బ్యూరో, జూన్ 20 (తీన్మార్ న్యూస్): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లలో డిపాజిట్లు కూడా కోల్పోవడంతో చాలా మంది నేతలు రాజకీయ భవిష్యత్ పై ఆందోళన చెందుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వారిపై ఒత్తిడి వస్తోంది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ప్రయోగించిన ఆకర్ష్

మిగతా 2 లో



## ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి అక్టోబరులో శంకుస్థాపన

**ఉత్తర భాగానికి రెండు నెలల్లో టెండర్లు**

**ఢిల్లీలో 22 అంతస్తుల్లో తెలంగాణ భవన్**

**ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

హైదరాబాద్, జూన్ 20 (తీన్మార్ న్యూస్): రీజనల్ రింగ్ రోడ్డు b(ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి అక్టోబరులో శంకుస్థాపన చేస్తాం. ఉత్తరభాగానికి రెండు నెలల్లో టెండర్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాం అని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. సచివాలయంలో జాతీయ రహదారులు, ప్రాజెక్టులు, రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెండింగ్‌లో ఉన్న ఆస్పత్రుల నిర్మాణాలపై ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల అధికారులతో సమీక్ష

మిగతా 2 లో



## 11లక్షల పిల్లలకు నులిపురుగుల నివారణ టాబ్లెట్స్ పంపిణి

**జూన్ 20 నుంచి 27 వరకు నులిపురుగుల నివారణ కార్యక్రమం**

**హైదారాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన**

.. వివరాలు 2లో



## సీఎం రేవంత్‌రెడ్డిపై మందకృష్ణ మాదిగ మరోసారి సీరియస్

**కాంగ్రెస్ పార్టీ మాదిగలను మోసం చేసిందంటూ మండిపాటు**

**పద్ధతి మార్చుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఉండదంటూ హెచ్చరించిన మందకృష్ణ**

తెలంగాణ బ్యూరో, జూన్ 20 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్‌రెడ్డిపై మందకృష్ణ మాదిగ మరోసారి సీరియస్ అయ్యారు. పద్ధతి మార్చుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఉండదని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉ ండరని హెచ్చరించారు. గురువారం మందకృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ మెజారిటీ ఎంపీ స్థానాలు ఎందుకు గెలవలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మందకృష్ణ మాదిగ మండిపడ్డారు.

## షెడ్యూల్ ప్రకారమే నిర్వహించనున్న గ్రూప్-1, 2,3 పరీక్షలు

**షెడ్యూల్ ప్రకారమే ఏర్పాట్లు చేస్తున్న టీజీపీఎస్సీ**

హైదరాబాద్, జూన్ 20 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1 మెయిన్, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను షెడ్యూల్ ప్రకారమే నిర్వహించడానికి టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెల 9న నిర్వహించిన ప్రిలిమ్స్ ఫలితాలు త్వరలోనే

మిగతా 2 లో




## గ్రూప్-2 ఖాళీలను, గ్రూప్-3 పోస్టులను పెంచాలని డిమాండ్

**ధర్నా చౌక్ వద్ద భారీ నిరసనకు దిగిన అభ్యర్థులు**

**రాష్ట్రవ్యాప్తంగా వేదిక వద్దకు చేరుకున్న నిరసనకారులు**



.. వివరాలు 2లో



## అరబిందో కోసమే "గత సర్కార్" గనుల వేలంలో పాల్గొనలేదు

**ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధం అని భట్టి సవాల్**

**గత సర్కార్ పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపణలు**

**బీఆర్ఎస్ తీరు దొంగే.. దొంగ దొంగ అన్నట్లు ఉందని విమర్శలు**

ఖమ్మం, జూన్ 20 (తీన్మార్ న్యూస్): లిక్కర్ స్కాంలో సహకరించిన అరబిందో గ్రూపు కోసమే సింగరేణి గనుల కేటాయింపు వేలంపాటలో గత సర్కారు పాల్గొనలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం మినరల్స్ యాక్ట్ 1957 కు చేసిన సవరణ బిల్లుకు

మిగతా 2 లో



## నీట్ పరీక్ష అవకతవకలపై కేంద్రం స్పందించాలి

**కేంద్ర దర్యాప్తు సంస్థ ద్వారా విచారణ చేపించాలి**

**బాధ్యత గల అధికారలపై చర్యలు తీసుకోవాలి**

**తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్**

.. వివరాలు 2లో




## రాచకొండ పోలీసుల "రావుగారు రిటైర్ అయ్యాడు" ఫన్నీ పోస్ట్

**సైబర్ నేరాలపై కనువిప్పు కల్గించేలా వినూత్న ప్రయోగం**


**తమాషా పోస్ట్ తో తగిన సూచనలు**

**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫన్నీ కథ**

తెలంగాణ బ్యూరో, జూన్ 20 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు కూడా నిరంతరం శ్రమిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో

మిగతా 2 లో

## మహిళా శక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్ గా మారాలి




**రద్దీ ప్రాంతాల్లో క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలి**

**క్వాలిటీపై మహిళా శక్తి క్యాంటిన్లు రాజీ పడొద్దు**

**రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**

2




## హైకోర్టుల్లో "నీట్" పెండింగ్‌లో విచారణలపై సుప్రీంకోర్టు స్టే

**ఎన్టీఏ దాఖలు చేసిన బదిలీ పిటిషన్లపై నోటీసు జారీ**

.. వివరాలు 2లో

## జూన్ 21న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

**మొదటి పేజీ తరువాయి**

సమాచారం. ఆగస్టు 15లోగా రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. కాగా, రైతుబంధు పథకం కింద తెలంగాణలో 66 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో రూ. 2 లక్షల లోపు రుణాలు పొందినవారు దాదాపు ఇంతమందే ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, రైతుబంధు లబ్ధిదారుల్లో దాదాపు 6 లక్షల మందికి పట్టాదారు పాస్‌బుక్‌లు లేవు. వాటిని ప్రామాణికంగా తీసుకుంటే లబ్ధిదారుల సంఖ్య 60 లక్షలకు తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఇది ఇలావుంటే, కుటుంబంలోని ఇద్దరు, ముగ్గురికి రైతుబంధు వస్తోంది. వారందరికీ రేషన్ కార్డుల్లేవు. కుటుంబ పెద్దకు మాత్రమే ఉంది. రేషన్ కార్డు నిబంధన పెడితే కుటుంబంలో రైతుకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని, దీంతో మరో 18 లక్షల మంది తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లింపుదారులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మినహాయిస్తే మరో రెండు లక్షల మంది తగ్గుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇవన్నీ పరిగణలోకి తీసుకుంటే రుణమాఫీ పథకానికి అర్హులయ్యేవారు 40 లక్షల మంది వరకే ఉంటారని అంటున్నారు.

## ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి అక్టోబరులో శంకుస్థాపన

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించారు. ఈ వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాజేంద్రనగర్‌లో నిర్మించే హైకోర్టు భవనాన్ని దేశంలోనే బెస్ట్‌గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం హైకోర్టు భవన డీపీఆర్ సిద్ధమవుతోంది అని వివరించారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ రింగ్ రైల్ ప్రాజెక్టును తీసుకువస్తామని, ఆర్ఆర్ఆర్– ఓఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్లు, స్పోర్ట్స్ జోన్‌లు రాబోతున్నాయని తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిని ప్రస్తుతం ఉన్న స్థానంలోనే పాత డిజైన్‌లోనే నిర్మిస్తామని కోమటిరెడ్డి వివరించారు. దీనిపై అఖిలపక్షం సమావేశాన్ని నిర్వహించాం. అవసరమైతే మరోసారి అఖిలపక్ష నేతలతో సమావేశమవుతాం. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, హైదరాబాద్ చుట్టుపక్కల నిర్మాణంలో ఉన్న 4 టిమ్స్ ఆస్పత్రులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువస్తాం అని వెల్లడించారు. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిని 6 లేన్లకు విస్తరించే పనులను డిసెంబరులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. ఈ రోడ్డును గ్రీన్‌ఫీల్డ్ హైవేగా మార్చేలా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ రహదారి విస్తరణ విషయంలో కాంట్రాక్ట్ కంపెనీ కొర్రీలు పెట్టడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి పనులు త్వరగా జరిగేలా విజ్ఞప్తి చేస్తాం. ఈ రహదారిపై ప్రమాదాలు జరిగే 17 బ్లాక్‌స్పాట్లను ఇప్పటికే గుర్తించాం. వాటిని సరిచేసేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఈ నెల 23 నుంచి చౌటుప్పల్ వద్ద ఈ పనులను ప్రారంభిస్తాం. హైదరాబాద్ – బెంగళూరు రహదారిని రూ.5,600 కోట్లతో ఎక్స్‌ప్రెస్ వేగా అభివృద్ధి చేయాలనే ఆలోచనలో ఉన్నాం. రూ.6వేల కోట్లతో శ్రీశైలం హైవేను నిర్మించాలనుకుంటున్నాం. వీటికి సంబంధించిన డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయి. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్, అంబర్‌పేట్ ఫ్లైఓవర్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం అని కోమటిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో పలు రోడ్లను జాతీయ రహదారులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీఎం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూసీ ప్రాజెక్టును నమామి గంగే మాదిరిగా చేపడతామన్నారు. ఢిల్లీలో తెలంగాణ భవన్‌ను దాదాపు 5.2 ఎకరాల స్థలంలో 22 అంతస్తులతో నిర్మించనున్నట్టుతెలిపారు. ఆర్అండ్‌బీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న చిన్న బిల్లులు రూ.400 కోట్ల వరకు ఉంటాయని, వాటిని త్వరలోనే చెల్లిస్తామన్నారు.

**పార్కింగ్ లేకుండా ఎలా కట్టారు!**

సచివాలయం పార్కింగ్ విషయంలో మంత్రి కోమటిరెడ్డి సంబంధిత అధికారులపై సీరియస్ అయినట్లు తెలిసింది. అసలు పార్కింగ్ సదుపాయం లేకుండా సచివాలయాన్ని ఎలా నిర్మించారు? మంత్రులు, అధికారులు, వీఐపీల కార్లను ఎండకు ఎండేలా వానకు తడిసేలా పార్క్ చేయాలా.. డ్రైవర్లు ఎక్కడుంటారు.. అని ప్రశ్నించినట్లు సమాచారం. దీనికి అధికారులు స్పందిస్తూ సోలార్ రూఫ్‌టాపలను ఏర్పాటు చేసి, వాటి కింద కార్లను పార్క్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, మల్టీపర్పస్ పార్కింగ్ అంశాన్ని అధ్యయనం చేస్తున్నామని వివరించారు. కాగా, మంత్రి కోమటిరెడ్డి ఈనెల 25న ఢిల్లీ వెళ్లనున్నారు. రెండ్రోజులపాటు ఆయన ఢిల్లీలో ఉంటారు. రహదారుల నిర్మాణాలకు అనుమతులు, అటవీ భూముల సేకరణ సహా పలు అంశాలపై కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, భూపేంద్ర యాదవ్‌లతో సమావేశమవ్వనున్నారు.%రి

## 11లక్షల పిల్లలకు నులిపురుగుల నివారణ టాబ్లెట్స్ పంపిణి

హైదరాబాద్, జూన్ 20 (తీన్మార్ న్యూస్): జూన్ 20 నుంచి ఈ నెల 27 వరకు హైదరాబాద్ లో ఉన్న 11 లక్షల 77 వేల మంది పిల్లలకు నులిపురుగుల నివారణ కార్యక్రమం ద్వారా టాబ్లెట్స్ (డీ వార్మింగ్ టాబ్లెట్స్) ఇవ్వడం జరుగుతుందని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం రాజ్ భవన్ హైస్కూల్ లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాజరైన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి పొన్నం పాల్గొన్నారు. విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలను మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ స్వయంగా వేశారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డీ వార్మింగ్ డే జరుపుకుంటున్నామన్నారు. తెలంగాణ భాషలో చెప్పాలంటే నట్టల మందు కార్యక్రమం అని అన్నారు. పిల్లల శారీరక ఎదుగుదలకు సంబంధించి డీ వార్మింగ్ టాబ్లెట్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 19 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలు ఈ మందులు వేసుకోవాలన్నారు. శారీరక ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే ఈ టాబ్లెట్స్ వేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ టాబ్లెట్స్ వేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ లో ఆరోగ్యానికి సంబంధించిన మరిన్ని కార్యక్రమాలు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని ఆయన చెప్పారు. ఆరోగ్య శాఖను మరింత ముందుకు తీసుకుపోవడానికి మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో సమీక్షా నిర్వహించారన్నారు.


## నీట్ పరీక్ష అవకతవకలపై కేంద్రం స్పందించాలి

హైదరాబాద్, జూన్ 20 (తీన్మార్ న్యూస్): నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాల అంశంలో చాలామంది విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి బాధ్యత గల అధికారలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ అవకతవకలపై సీబీఐ విచారణ చేపట్టాలన్నారు మంత్రి శ్రీధర్ బాబు. విద్యార్థులకు న్యాయం చేయాలని చెప్పారు. పోటీ పరీక్షల నిర్వహణలో ప్రధానంగా వైద్య విద్యలో అన్ని రాష్ట్రాల్లో ఆందోళనలు జరుగుతున్నాయని తెలిపారు మంత్రి. నీట్ పరీక్ష నిర్వహణలో ఎన్డీఏ సర్కార్ దారుణంగా ఫెయిల్ అయిందన్నారు. నీట్ పై నమ్మకం కలిపించేలా వ్యవహరించాల్సిన అవసరం కేంద్రంపై ఉందని చెప్పుకొచ్చారు. మరోవైపు సింగరేణి సంస్థ లాభాల్లో నడుస్తుందని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు. కార్మికుల నైపుణ్యం వల్ల అది బలంగా ఉందని తెలిపారు. సింగరేణి ద్వారానే కొత్త బొగ్గు గనులను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారానే చేయాలి. కానీ ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్నట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెబుతున్నారన్నారు. దీనిపై కేంద్ర సర్కార్ పునరాలోచన చేసుకోవాలని సూచించారు. కిషన్ రెడ్డి ఒకచేతితో ప్రైవేట్ పరం చేయమని అంటునే మరోవైపు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే పనిలో కేంద్ర సర్కార్ ఉందన్నారు శ్రీధర్ బాబు. దొందా వైఖరితో ఎన్డీఏ సర్కార్ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దీనిపై ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతారని చెప్పుకొచ్చారు. శాంతి భద్రతల విషయంలో సర్కార్ అలర్ట్ గా ఉందన్న శ్రీధర్ బాబు ఎవరు విఘాత కలిగించిన సహించేది లేదని హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వం నుండి తాము నేర్చుకోవాల్సిన అవసరం లేదంటూ కామెంట్స్ చేశారు.

## హైకోర్టుల్లో "నీట్" పెండింగ్‌లో విచారణలపై సుప్రీంకోర్టు స్టే

న్యూ ఢిల్లీ, జూన్ 20 (తీన్మార్ న్యూస్): నీట్ (యూజీ) పేపర్ లీకేజీకి సంబంధించి దేశంలోని వివిధ హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న విచారణలపై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దాఖలు చేసిన బదిలీ పిటిషన్లపై నోటీసు జారీ చేస్తూ, జస్టిస్ విక్రమ్ నాథ్ అధ్యక్షతన వెకేషన్ బెంచ్ వివిధ హైకోర్టులలో పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలపై తదుపరి లిస్టింగ్ తేదీ వరకు స్టే విధించింది. విచారణ సమయంలో, సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసినప్పటికీ, నీట్ (యుజి) పరీక్షలో వివిధ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వచ్చిన పిటిషన్లను హైకోర్టులు విచారిస్తున్నాయని జస్టిస్ ఎస్‌విఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ముందు ఎన్టీఏ తరపు న్యాయవాది సమర్పించారు. గత వారం ఇదే బదిలీ పిటిషన్. పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన ఇతర పిటిషన్లతో పాటు బదిలీ పిటిషన్ల బ్యాచ్ జూలై 8న తదుపరి విచారణకు రానుంది. అంతకు ముందు జూన్ 14న, ఢిల్లీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలంటూ ఎన్‌టిఎ చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. ఎన్టీఏ యొక్క బదిలీ అభ్యర్థనను పరిశీలించడానికి అంగీకరిస్తూ, నీట్ (యుజి) పరీక్షలో పేపర్ లీక్ అయిందని ఆరోపిస్తూ ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిన అభ్యర్థి ప్రతిస్పందనను సుప్రీంకోర్టు కోరింది. నీట్ (యుజి) పరీక్షలో గ్రేస్ మార్కుల మంజూరుకు సంబంధించిన సమస్యను సుప్రీంకోర్టు ఇప్పటికే మూసివేసింది, ఎన్‌టిఎ సమయం కోల్పోయిన కారణంగా పరిహారం మార్కులు పొందిన 1,563 మంది అభ్యర్థుల స్కోర్‌కార్డులను ఉపసంహరించుకుంది. మరియు రద్దు చేయబడింది. ఈ అభ్యర్థులకు జూన్ 23న జరిగే రీ-టెస్ట్‌లో హాజరు కావడానికి లేదా సాధారణీకరణ లేకుండా పరీక్షలో పొందిన వాస్తవ మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్‌కు హాజరు కావడానికి ఎంపిక ఇవ్వబడింది.

# బీఆర్ఎస్‌లో అంతర్గత అలజడి




తరహాలోనే ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆకర్ష్ అస్త్రం ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు. ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే చనిపోవడంతో వచ్చిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు.

**కాంగ్రెస్తో పలువురు ఎమ్మెల్యేల చర్చలు.. ?**

ప్రస్తుతం 35 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్లో ఉన్నారు. వీరిలో కనీసం ఇరవై మందిని పార్టీలో చేర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. నిజానికి పార్టీ ఫిరాయింపులపై పార్లమెంట్ ఎన్నికల కంటే ముందు నుంచే ఊహాగానాలు వస్తున్నాయి. కొంత మంది ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం అయ్యారు. వారంతా కాంగ్రెస్ చేరికలను ఖండించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే చేరిపోవడానికి రెడీ అయినా చివరి క్షణంలో ఆగిపోయారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను బట్టి నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. ఇప్పుడు వారందరితో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మ-రోసారి చర్చించి చేరికలకు రంగం సిద్ధం చేసుకున్నట్లుగా చెబుతున్నారు.

పిలిచి మాట్లాడుతున్న కేసీఆర్ ఎవరెవరు కాంగ్రెస్లో చేరుతారో స్పష్టత రావడంతో బీఆర్ఎస్ హైకమాండ్ వారిని బుజ్జగించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. కొద్ది రోజుల కిందట నలుగురు ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫామ్ హౌస్కు పిలిపించుకుని మాట్లాడారు. వారితో దిగిన ఫోటోను విడుదల చేశారు. వారు పార్టీ మారుతారని తెలియడంతోనే పిలిచి మాట్లాడారని అంటున్నారు.

అలాగే గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కూడా పార్టీ మారబోతున్నారని అంటున్నారు. ఆయనను చేర్చుకోవద్దని కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన సరితా తిరుపతయ్య పోరాడుతున్నారు . కానీ ఆమెకు అభయం లభించలేదని తెలుస్తోంది.

కేసీఆర్కు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేస్తారా ?, అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవ్వాలని అనుకుంటున్నారు. అంతకు ముందే ఆయనకు ప్రతిపక్ష నేత హోదా పోయేలా చేయాలని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రయత్నిస్తోందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీనే కాదు.. బీజేపీ కూడా ఎమ్మెల్యేలను ఆకర్షించే ప్రయత్నంలో ఉందని చెబుతున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా తామే వ్యవహరించాలని బీజేపీ అనుకుంటోంది. రాష్ట్రంలో రాజకీయ భవిష్యత్ బీజేపీకే ఉంటుందన్న ఉద్దేశంతో కొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీ వైపే చూస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో తమ పార్టీ నేతల్ని ఆపడం బీఆర్ఎస్ అగ్రనాయకత్వానికి తలకు మించిన భారం అవుతోంది.

## అరబిందో కోసమే "గత సర్కార్" గనుల వేలంలో పాల్గొనలేదు

**మొదటి పేజీ తరువాయి**



బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి ఇప్పుడు గగ్గోలు పెడుతోందని అన్నారు. బీఆర్ఎస్ తీరు దొంగే దొంగ దొంగ అని అరిచినట్టు ఉందని విమర్శించారు. రాష్ట్రంలో 40 బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని, 22 బొగ్గు గనులు మూసివేతకు గురవుతాయని అన్నారు. 2031 వరకు ఉత్పత్తి జరగాలంటే కొత్త గనులు సంపాదించుకోవాలని అన్నారు. గతంలో ప్రభుత్వం రంగ సంస్థలకు గనులను కోల్ ఇండియా కేటాయించేదని, సవరణల తర్వాత అందరూ వేలంలో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. వేలంలో పాల్గొనాలని సింగరేణి 2021 లో బోర్డు నిర్ణయం తీసుకున్నదని చెప్పారు. కానీ నవంబర్ 5వ తేదీన ఆనాటి సీఎం కేసీఆర్ బొగ్గు గనులు తీసుకోవద్దనే నిర్ణయం ప్రకటించారని చెప్పారు. దీంతో కోయగూడెం బ్లాక్ లిక్కర్ స్కాంలో కీలకంగా వ్యవహరించిన అరబిందో కంపెనీకి దక్కిందన్నారు. సత్తుపల్లి బ్లాక్ ప్రతిమ గ్రూప్ కు చెందిన అవంతిక సంస్థకు దక్కిందని అన్నారు. ఈ రెండు కంపెనీలు బీఆర్ఎస్ నేతలకు సన్నిహితంగా ఉన్న వారివని ఆరోపించారు. ఇక్కడ వద్దని సింగరేణి సంస్థకు చెప్పిన కేసీఆర్ ఒడిశాలో మాత్రం పాల్గొనాలన్నారనిన తెలిపారు. కేసీఆర్ తెలంగాణకు తలమాణికంగా ఉన్న సింగరేణి సంస్థను సర్వనాశనం చేశారని ఆరోపించారు. ఈ విషయంలో కేటీఆర్, హరీశ్ రావు చర్చకు వస్తారా.. నేను ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధం అని భట్టి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్ర గనుల శాఖ మంత్రిని కలిసిందని, బొగ్గుగనులను సింగరేణికి వేలం లేకుండా ఇవ్వాలని కోరామని భట్టి చెప్పారు. ఈ విషయమై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కూడా లేఖ రాస్తామని భట్టి వెల్లడించారు. ప్రధాన మంత్రిని కూడా కలిసి పరిస్థితిని వివరిస్తామని చెప్పారు. ఈ రెండు బ్లాకులను రద్దు చేసి సింగరేణికి ఇవ్వాలని కోరుతామని అన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని పార్టీల నేతలను కలుపుకొని పోతామని, తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని భట్టి విక్రమార్క వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అఖిల పక్షం ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీ ని కలుస్తామని భట్టి విక్రమార్క వివరించారు.

## మహిళా శక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్ గా మారాలి



హైదరాబాద్, జూన్ 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో మహిళా సంఘాలను ఆర్థికంగా ప్రోత్సహిస్తూ మరింత బలోపేతం చేసేందుకు మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు పరుస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహిళా ఉన్నతితోనే తెలంగాణ ప్రగతి సాధ్య పడుతుందన్నారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు (డీఆర్డీఓ), అదనపు డీఆర్డీఓలతో మహిళా శక్తి, రాష్ట్ర స్థాయి కార్యాచరణ ప్రణాళిక తయారీపై మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డిమాండ్ ఉన్న వ్యాపారాల్లో మహిళల సంఘాలకు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయి వాస్తవాలకు, ప్రజల అవసరాలు, వనరుల లభ్యతకు తగ్గట్టుగా బిజినెస్ మోడల్ ఉండాలన్నారు. మహిళా సంఘాలకు ఆధార్ కేంద్రాలు, మీ సేవ సెంటర్లు, పౌల్ట్రీ, డెయిరీ వ్యాపారాలు, క్యాంటీన్లు, స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసుకునేందుకు రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కొత్తగా ప్రారంభించబోయే మహిళా శక్తి క్యాంటీన్లలో రుచి, శుభ్రత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా శక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్ గా ఎదగాలని ఆకాంక్షించారు. పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ రహదారుల వెంట, రద్దీ ప్రాంతాల్లో మహిళా క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. క్వాలిటీపై మహిళా శక్తి క్యాంటిన్లు రాజీ పడొద్దన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పల్లె రుచులను, ఇప్ప పువ్వు లడ్డులు, నన్నారి వంటి సాంప్రదాయిక పానీయాలను పట్టణాలకు పరిచయం చేయాలని సూచించారు. మహిళల ఆర్థిక స్థితిగతులను మార్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ హయాంలోనే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్ ) ఏర్పాటయిందని గుర్తు చేశారు. దాన్ని మరింత పటిష్టపరిచి సేవలను విస్తరించాలన్నారు. వచ్చే ఐదేళ్లలో మహిళా సంఘాలకు లక్ష కోట్ల రుణాలు అందిస్తామన్నారు. మహిళా సంఘాల కోసం మంచి బిజినెస్ మోడల్‌లను అధికారులు గుర్తించాలని సూచించారు. డీఆర్డీవోలు జిల్లాలో పర్యటించి మహిళా సంఘాల అనుభవాలు తెలుసుకోవాలన్నారు. అందుకోసం వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. మహిళలు ఇతరుల మీద ఆధారపడకుండా ఆర్థికంగా సొంత కాళ్ళ మీద నిలబడేలా తోడ్పాటు అందించాలన్నారు. మహిళలు అభివృద్ధి చెందిన తర్వాత ప్రభుత్వాలకే రుణాలు ఇచ్చే స్థాయికి ఎదుగుతారని తెలిపారు. మహిళ సంఘాలకు ఆర్థిక చేయూత నందించేందుకు కలెక్టర్లతో త్వరలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వాహిస్తామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు భూ కేటాయింపులు మొదలుకుని, ప్రభుత్వ రాయితీల వరకు మహిళా సంఘాలకు కలెక్టర్లు సహకరించాలని కోరారు.

**సచివాలయంలో ప్రారంభమైన మహిళా శక్తి క్యాంటిన్లు**

సీఎం ఆలోచనలకు మంత్రి సీతక్క కార్యరూపంలో పెట్టారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటిన్లు ఏర్పాటుకు చొరవ తీసుకొని వాటిని ప్రారంభించేందుకు కృషి చేసారు. ఇందులో భాగంగా శుక్రవారం సచివాలయంలో శుక్రవారం రెండు క్యాంటిన్లు ప్రారంభించనున్నారు.

## విదేశాల్లో విధుల నిర్వహణకు ఎంపికైన తెలంగాణ పోలీసులు

***పీస్ కమిషన్ విధుల నిర్వహణకు 19 మంది ఎంపిక***

***దేశ వ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపు తెచ్చిన రాష్ట్ర పోలీసులు***




తెలంగాణ బ్యూరో, జూన్ 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పోలీసు శాఖకు చెందిన అధికారులు ఐక్యరాజ్య సమితి ద్వారా వివిధ దేశాల్లో నియమించే పీస్ కమిషన్ విధులను నిర్వహించేందుకు ఎంపికయ్యారు. రాష్ట్ర పోలీసు విభాగం నుంచి మొత్తం 22 మంది ఈ పరీక్షలకు హాజరు కాగా అందులో 19 మంది ఎంపికయ్యారు. శాంతిభద్రతలు అస్తవ్యస్తంగా ఉన్న దేశాల్లో ఈ అధికారులు ఓ ఏడాది పాటు విధులు నిర్వహించి అక్కడ శాంతి సామ-రస్యాలను నెలకొల్పేందుకు తమ వంతు పాత్రను నిర్వహించనున్నారు. ఇందుకోసం ఢిల్లీ జూన్ 6 నుంచి 15 వరకు న్యూయార్క్ నుంచి వచ్చిన పోలీసు అధికారులు పరీక్షలను నిర్వహించారు. ఇందులో ఆంగ్లం, డ్రైవింగ్, ఫైరింగ్ వంటి అంశాలలో పరీక్షలను పెట్టారు. దేశ వ్యాప్తంగా 225 హాజరు కాగా అందులో 164 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 19 మంది తెలంగాణ నుంచి ఉండడంతో రాష్ట్ర పోలీసు విభాగానికి ప్రతిష్ట అటు దేశంలోను, ప్రపంచంలోను గుర్తింపు వచ్చింది. విధులకు ఎంపికైన అధికారు కేఎం.కిరణ్ కుమార్, ఏసీబీ, హైదరాబాద్ సీసీఎస్, నర్సింగ్‌రావు డీఎస్పీ, యాంటీ నార్కోటిక్ బ్యూరో, అలెక్స్, కమాండెంట్, దేవేందర్ సింగ్, ఎస్పీ, చల్లా శ్రీధర్, డీఎస్పీ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, ప్రతాప్, డీఎస్పీ విజిలెన్స్ విభాగం, శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ, కోదాడ, జూపల్లి రమేశ్, ఏసీపీ, మాజిద్ అలీఖాన్, ఏసీపీ, సురేశ్, ఇన్స్పెక్టర్, సైబరాబాద్, యాదగిరి హెడ్ కానిస్టేబుల్, అలేరు పీఎస్, విజయ్‌కుమార్, సీఐడీ, ఇన్స్పెక్టర్, శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ ఉన్నారు. విధులకు ఎంపికైన అధికారు కేఎం.కిరణ్ కుమార్, ఏసీబీ, హైదరాబాద్ సీసీఎస్, నర్సింగ్‌రావు డీఎస్పీ, యాంటీ నార్కోటిక్ బ్యూరో, అలెక్స్, కమాండెంట్, దేవేందర్ సింగ్, ఎస్పీ, చల్లా శ్రీధర్, డీఎస్పీ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, ప్రతాప్, డీఎస్పీ విజిలెన్స్ విభాగం, శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ, కోదాడ, జూపల్లి రమేశ్, ఏసీపీ, మాజిద్ అలీఖాన్, ఏసీపీ, సురేశ్, ఇన్స్పెక్టర్, సైబరాబాద్, యాదగిరి హెడ్ కానిస్టేబుల్, అలేరు పీఎస్, విజయ్‌కుమార్, సీఐడీ, ఇన్స్పెక్టర్, శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ ఉన్నారు.

నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే వారికి ప్రస్తుత పరిస్థితుల్లో సరైన గుర్తింపు లేదని పీసీ కమిషన్ విధులకు ఎంపికైన అధికారులు తెలిపారు. ఐక్యరాజ్య పోస్టింగ్ పొందాలంటే వృత్తి నైపుణ్యతకు చోటులేదని, కలరింగ్‌తో పాటు పొలిటికల్ మెనేజ్‌మెంట్ స్కిల్స్ ఉంటే సరిపోతుండడంతో వాటి కోసం తాపత్రయం పడడం కన్నా ఇలాంటి సేవలు ఉత్తమమని వారు తెలిపారు. అందకే పరీక్షలు రాసి తమ టాలెంట్‌ను నిరూపించుకుని ప్రశాంతంగా ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందామనే సంతృప్తితో విదేశాలలో విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

## గ్రూప్-2 ఖాళీలను, గ్రూప్-3 పోస్టులను పెంచాలని డిమాండ్

హైదరాబాద్, జూన్ 20 (తీన్మార్ న్యూస్): గ్రూప్–2 ఖాళీలను 2వేలు, గ్రూప్–3 పోస్టులను 3వేలు పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గ్రూప్ ఉద్యోగాల అభ్యర్థులు, నిరుద్యోగ యువత గురువారం ధర్నా చౌక్ వద్ద భారీ నిరసనకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా వేదిక వద్దకు చేరుకున్న నిరసనకారులు గ్రూప్–1 మెయిన్ పరీక్షకు అభ్యర్థుల ఎంపికను 1:50 నిష్పత్తిలో కాకుండా 1:100 నిష్పత్తిలో పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దశాబ్దం విరామం తర్వాత గ్రూప్–1 నోటిఫికేషన్ విడుదలైనందున, 563 గ్రూప్–ఐ పోస్టుల భర్తీలో ప్రభుత్వం తమకు తగిన అవకాశం కల్పించాలని ఆశావహులు కోరుతున్నారు. గ్రూప్–%××, ×××% పరీక్షలను డిసెంబర్ వరకు వాయిదా వేయడం, ప్రభుత్వ , స్థానిక సంస్థల పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం మెగా డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ నోటిఫికేషన్, %+ూ% 46 ను రద్దు చేయడం, రెసిడెన్షియల్ విద్యా సంస్థల రిక్రూట్‌మెంట్‌కు ఎంపికైన అభ్యర్థులకు రిలింక్విష్‌మెంట్ ఎంపికను అందించడం, నిరుద్యోగ యువత లేవనెత్తిన ఇతర డిమాండ్లు. నల్గొండ నుంచి వచ్చిన సింధూజ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత నిరుద్యోగ యువత సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని తెలిపారు. మేము రాహుల్ గాంధీతో లేవనెత్తిన అదే డిమాండ్లు, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వాటిని పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ నినాదం %–% మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి %–% అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతను ఆకర్షించడానికి ఎరగా ఉపయోగించారు, ఇప్పుడు వారు తప్పిపోయారు, అని ఆమె అన్నారు.

## షెడ్యూల్ ప్రకారమే నిర్వహించనున్న గ్రూప్–1, 2,3 పరీక్షలు

**మొదటి పేజీ తరువాయి**

విడుదల చేయడానికి కసరత్తు చేస్తున్నది. అనంతరం గ్రూప్–1 మెయిన్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించనున్నది. గ్రూప్–1లోని 563 పోస్టుల కోసం 4.03 లక్షల మంది ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసుకోగా, 3లక్షల మంది హాజరైనట్టు సమాచారం. ప్రిలిమ్స్ ఫలితాల్లో 1:50 నిష్పత్తి ప్రకారం మెయిన్‌కు అభ్యర్థుల ఎంపిక కొనసాగుతున్నది. 2022 లో విడుదలైన గ్రూప్–2 నోటిఫికేషన్‌లో 783 ఖాళీలు ప్రకటించారు. గ్రూప్–2 పోస్టులకు ఆగస్టు 7, 8న రాతపరీక్షలు నిర్వహించనున్నారు. నవంబర్ 17, 18న గ్రూప్–3 పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నోటిఫికేషన్‌లో 1388 పోస్టులు ప్రకటించారు.

**1:100 నిష్పత్తి పాటించాలి**

షెడ్యూల్ ప్రకారమే గ్రూప్స్ పరీక్షలు నిర్వహించడానికి అధికారులు సిద్ధమవుతుంటే, నిరుద్యోగుల్లో ఉత్కంఠ పెరుగుతుంది. గ్రూప్–2, గ్రూప్–3లో రాత పరీక్షలు నిర్వహించలేదు. ఈలోపే గ్రూప్–2లో 2000, గ్రూప్–3లో 3000 వరకు పోస్టులు పెంచాలని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్–1 మెయిన్‌కు 1:100 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చే యాలని కోరుతున్నారు. అదనపు పోస్టు లు పెంచాలని పేర్కొన్నారు. డిమాండ్ల సాధనకు నేడు నిరుద్యోగులు ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నారు.

## రాచకొండ పోలీసుల "రావుగారు రిటైర్ అయ్యాడు" ఫన్నీ పోస్ట్

**మొదటి పేజీ తరువాయి**

రాచకొండ పోలీసులు సైబర్ నేరాలు అర్థమయ్యేలా కథ చెప్పి కనువిప్పు కల్పించడానికి వినూత్న ప్రయోగం చేశారు. ప్రస్తుతం రాచకొండ పోలీసులు పోస్ట్ చేసిన ఈ ఫన్నీ స్టోరీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రావు గారు రిటైర్ అయ్యాడు.. పెద్ద మొత్తంలో రిటైర్మెంట్ అమౌంట్ వచ్చింది. రూ. 20 లక్షలు. తన మరియు భార్య జాయింట్ అకౌంట్లో ఉంచి, ఆమెకు ఏటిఎం కార్డు పిన్ కూడా చెప్పారు. ఒకసారి పనిమీద గంట సేపు బయటకు వెళ్లాక ఫోన్ మర్చిపోయానని గుర్తుకొచ్చింది. వెంటనే ఇంటికి వచ్చారు. సోఫాలో పడివున్న ఫోన్ చూసి కుదుటపడ్డారు. సోఫాలో కూర్చొని భార్యను ఫోన్ వచ్చిందా..? అని అడిగారు. అవునండి... బ్యాంకు నుంచి ఫోన్ వచ్చింది జాయింట్ అకౌంట్ సమాచారాన్ని అప్డేట్ చేయమని చెప్పింది భార్య. రావుగారికి చెమటలు పట్టి సోఫాలో కూలబడ్డాడు. భయాందోళనతో 'ఒ.టి.పి. ఇచ్చావా..?' అని అడిగాడు. భార్య అవును అని సమాధానం చెప్పింది. బ్యాంకు మేనేజర్ స్వయంగా నాకు ఫోన్ చేయగా నేను అతనికి ఇచ్చాను అని అంది భార్య. భార్య మాటలను విన్న రావుగారు ఇంకా కుప్పకూలిపోయాడు. తల తిరుగుతున్నట్టు అనిపించింది. తన మొబైల్ ఫోన్లో బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేశాడు. ఇందులో రూ.20 లక్షలు అలాగే ఉన్నాయి. ఏ ఓటీపీ ఇచ్చావు అని అడిగారు రావు గారు. భార్య అమాయకంగా చెప్పింది ఓటీపీ 4042గా వచ్చింది. జాయింట్ అకౌంట్ కదా.. నా వంతు ఓటీపీ 2021 ఇచ్చానని చెప్పింది. రావుగారికి పోయిన ప్రాణం వచ్చినట్లు అనిపించింది. హమ్మయ్య ఇంత తెలివైన భార్య నాకు దొరకడం అదృష్టం అనుకున్నాడు. జాయింట్ అకౌంట్ పెట్టుకోవడం ఇంత సేఫా అనుకుని.. అందుకనే కదా అర్థాంగి అంటారు..! అంటూ క్యాప్షన్ ఇస్తూ ఈ ఫన్నీ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇలాంటి వినూత్న ప్రయోగాలు చేసి ప్రజలను ఆకట్టుకునేలా తమాషా పోస్ట్‌లను అందరూ చదవాలని భావించి సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఈ తరహా కొత్త ప్రయోగాలు చేస్తోంది. ఇలాంటి పోస్టులు చూసి నవ్వుకోవడమే కాకుండా సైబర్ నేరాల విషయంలో ఎలా జాగ్రత్తగా ఉండాలో కూడా తెలుసుకోవాలి.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# సత్వర న్యాయం జరిగేది ఎన్నడు...

నేరచరితులే పాలకులైతే...

ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్యం మనది. అయితే, మన ఎన్నికల్లో అంగబలం, అర్థబలం లేనిదే పోటీ చేయటం సాధ్యమేనా? ఒకవేళ ప్రజాబలాన్ని నమ్ముకుని బరిలో దిగితే ఏమవుతుంది? వంటి ప్రశ్నలకు జవాబులేమిటో మనందరికీ స్పష్టంగా తెలుసు. ఒకప్పుడు సమాజంలో గౌరవ మర్యాదలు, సేవాభావం, నిజాయితీ ఉన్న నేతలు పావలా ఖర్చు లేకుండానే చట్టసభలకు ఎన్నికై ప్రజాసేవ చేసేవారు. కానీ, నేడు అర్థబలం, కులబలం ఉన్న నేతలో చట్టసభలకు ఎన్నిక కాగలుగుతున్నారు. తాజాగా నేర చరిత్ర కూడా అభ్యర్థి ఎంపిక విషయంలో ఒక అదనపు అర్హతగా మారుతోందేమోననే అనుమానాలు వస్తున్నాయి. హత్యలు, మానభంగాలు, వంటి తీవ్రనేరాలకు పాల్పడి, కేసులు ఎదుర్కొంటున్నవారు కూడా నిస్సంకోచంగా చట్టసభలకు పోటీచేయటమే గాక గెలిచి, మంత్రులు కావటాన్నీ నేడు మనం చూస్తున్నాం. తాజాగా జరిగిన 18 లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల నేపథ్యాలపై విడుదలైన తాజా జాతీయ నివేదికలను గమనిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతోంది.లోక్‌సభలోని 545 స్థానాలకు ఈసారి మొత్తం 8,360 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 1,333 మంది జాతీయ పార్టీల తరపున, 532 మంది ప్రాంతీయ పార్టీల నుంచి పోటీపడగా, 2,580 మంది రిజిస్టర్డ్ పార్టీల నుంచి బరిలో నిలిచారు. వీరుగాక 3,915 మంది స్వతంత్ర అభ్యర్థులు కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరిశీలించుకున్నారు. వీరిలో 8,337 మంది అఫిడవిట్లను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు పరిశీలించి ఒక నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం.. బరిలో నిలిచిన వారిలో 20 శాతం (1,643) మంది మీద క్రిమినల్ కేసులున్నాయి. వారిలో 1,190 మందిపై అత్యాచారం, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై దాడి వంటి తీవ్రమైన కేసులున్నాయి. క్రిమినల్ కేసులున్న అభ్యర్థుల సంఖ్య 2019 లోక్‌సభ ఎన్నికల్లో 1,500 కాగా ఈసారి 1,643కు పెరిగింది.పార్టీల పరంగా చూస్తే.. నేర చరిత్ర గల అభ్యర్థుల విషయంలో బీజేపీ ముందువరుసలో నిలిచింది. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన 440 మందిలో 191 మంది నేర చరితులే కాగా కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన 327 మంది అభ్యర్థుల్లో 143 మందికి నేర చరిత్ర ఉంది. బీఎస్పీ నుంచి 487 మంది పోటీ చేయగా వారిలో 63 మంది, సీపీఎం 52 మంది అభ్యర్థుల్లో 33 మందికి నేర చరిత్ర ఉంది. 3915 మంది ఇండిపెండెంట్ అభ్యర్థుల్లో 550 మంది క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్న వారే. రాష్ట్రాల వారీగా చూసినప్పుడు, ఈ జాబితాలో కేరళ ముందువరసలో ఉంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు పోటీ చేస్తున్న నాలుగు ప్రధాన పార్టీల నుంచి మొత్తం 53 మంది బరిలో ఉంటే.. వారిలో 34 మంది నేరచరితులేనని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ)' తెలిపింది. వీరిలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి 12 మంది చొప్పున, తొమ్మిదిమంది బీఆర్ఎస్ అభ్యర్థులు, ఒక మజ్లిస్ పార్టీ అభ్యర్థి ఉన్నారు. ఆర్జేడీ, డీఎంకే, ఎస్పీ, టీఎంసీ అభ్యర్థుల్లో 40 శాతం మంది ఏదో ఒక నేరానికి పాల్పడిన వారేనని ఈ నివేదిక తెలిపింది. 2009లో గెలిచిన ఎంపీలలో 30శాతం మందికి నేర చరిత్ర ఉండగా, 2014లో ఎన్నికైన వారిలో 34 శాతం మంది మీద క్రిమినల్ రికార్డులున్నాయి. 2019 నాటికి ఇది 43 శాతానికి పెరగగా, ప్రస్తుత లోక్‌సభ ఎంపీల్లో ఏకంగా 46 శాతానికి పెరిగింది. 18వ లోక్‌సభకు ఎన్నికైన బిజెపి ఎంపీల్లో 39 శాతం మంది నేర చరిత్ర కలిగి ఉండగా, కాంగ్రెస్ ఎంపీలలో 49శాతం, టిడిపి ఎంపీల్లో 50శాతం, వైసిపి ఎంపీల్లో 25శాతం మంది నేర చరిత్ర కలిగి ఉన్నారు.చట్టసభల్లో నేరచరితులు అడుగుపెట్టకుండా ఉండాలనే ఉద్దేశంతో గతంలో తెచ్చిన ప్రజా ప్రాతినిథ్య చట్టంలోని సెక్షన్ 8 (3) ప్రకారం ఒక వ్యక్తి నేరం చేసినట్లు నిర్ధారణై, రెండేళ్లకు పైబడి శిక్ష పడితే సదరు వ్యక్తి జైలు నుంచి విడుదలైన తేదీ నుంచి ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడవుతాడు. అయితే ఈ చట్టం కట్టుదిట్టంగా ఉన్నా, సత్వర న్యాయం అందని కారణంగా, వారు చేసిన నేరానికి కోర్టులు తగిన శిక్ష విధించినప్పుడే ఈ రూల్ అమలవుతోంది. ఈ విచారణా కాలంలోనే నేరగాళ్లు చట్టసభలకు పోటీచేసి, చట్ట సభల సభ్యులుగా చట్టాలను రూపొందిస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో వీరు మంత్రులు కూడా కాగా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో హోం మంత్రులుగానూ బాధ్యతలు చేపట్టారు. ఈ దుస్థితిని ప్రస్తావిస్తూ చార్జిషీటు దాఖలైన వారిని అనర్హులుగా ప్రకటించాలని గతంలో కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే.. చట్టాలు చేయటం తన పని కాదనీ, అలాంటి చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత పార్లమెంటుదేనని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ క్రమంలోనే.. ఎంపీ, ఎమ్మెల్యేల మీదున్న క్రిమినల్ కేసుల సత్వర విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలంటూ ఏడేళ్ల కిందట సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా పరిస్థితిలో ఆశించిన మార్పేమీ రాలేదు.మనలో చాలామంది చట్టసభలలోకి నేర చరితులు అడుగుపెట్టకుండా అడ్డుకునే బాధ్యత రాజ్యాంగ సంస్థలదేనని చేతులు దులుపుకుంటున్నాం గానీ, వారికి ఓటు వేసి చట్టసభలకు పంపుతున్నది మనమేనని గుర్తించలేకపోతున్నాం. ఓటర్లకు పలు తాయిలాలు ఎరచూపి ఎలాగోలా ఎన్నికల్లో నెగ్గుతున్న నేతల కుట్రలను గమనించాకైనా జనంలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. అప్పుడే స్వచ్ఛ చరిత్రగల, సమర్థవంతులైన నేతలు చట్టసభలకు ఎన్నిక కాగలుగుతారు.

# నులి పురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం

**– మున్సిపల్ చైర్మన్ ప్రకాష్**




నేరేడుచర్ల, జూన్ 20(తీన్మార్ న్యూస్): ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందించడం తల్లిదండ్రుల కనీస కర్తవ్యమని నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ ప్రకాష్ అన్నారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం భాగంగా విద్యార్థిని విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి,ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. జయ తో కలిసి నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తమ పిల్లల ఆరోగ్య సంరక్షణకు తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. నులి పురుగుల వల్ల రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, బరువు తగ్గడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. నులి పురుగుల నివారణకు తల్లిదండ్రులు ఒక సంవత్సరం నుంచి 19ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలన్నారు. నులి పురుగులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కలుషిత ఆహారం తీసుకోవద్దని, భోజనం చేసే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగయ్య, డా .నాగిని, సిహెచ్ వో.శ్రీనివాస్ సూపర్వైజర్ శ్యాంసుందర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్, నర్సయ్య, సునిత, ప్రధానోపాధ్యాయులు మధు, ఉపాధ్యాయులు, ఆశాలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు



హుజుర్నగర్, జూన్ 20(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మరియు పౌరసరఫరాల శాఖ మాత్యులు నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మ దినోత్సవం సందర్భంగా హుజూర్నగర్ పట్టణం కేంద్రం లోని టౌన్ హాల్ లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్ సూచన మేరకు యస్.వి ఫౌండేషన్ చైర్మన్ కుక్కల వెంకన్న మరియు ఎస్టీ సెల్ చైర్మన్ తేజావత్ సైదులు నాయక్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి దాదాపు 40 మంది రక్తదాతల సహాయంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కుక్కల వెంకన్న, తేజావత్ సైదులు నాయక్ మాట్లాడుతూ ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రి గా పదవి చేపట్టిన కొన్ని రోజులనే హుజూర్నగర్, కోదాడ నియోజకవర్గాలలో కొన్ని వందల వేల కోట్లతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయుష్ ఆరోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యరగాని నాగన్న గౌడ్, ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టంపల్లి మండల పార్టీ అధ్యక్షులు భూక్యా మంజు నాయక్, కాస్తాల శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, ఆదేర్ల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు జక్కుల శంబయ్య, జక్కుల వీరన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలు

**– జాన్ పహాడ్ దర్గాలో ప్రత్యేక పూజలు**
**– 220 మంది పేద విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ**
**– మనసున్న నేత, పేదల దేవుడు ఉత్తమ్**
**– ఎంపిపి గోపాల్ నాయక్, జెడ్పిటిసి బుజ్జి మోతిలాల్ నాయక్**





పాలకీడు, జూన్ 20(తీన్మార్ న్యూస్): రాష్ట్ర భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా మంత్రి, స్థానిక శాసనసభ్యులు కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి మనసున్న మహా నేత, పేదల దేవుడని పాలకవీడు ఎంపీపీ భూక్య గోపాల్, జడ్పిటిసి మాలోతు బుజ్జి మోతిలాల్ నాయక్ లు కొనియాడారు. గురువారం జిల్లా మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పాలకవీడు మండలంలోని జాన్ పహాడ్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాలకవీడు మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినిలతో కలసి జన్మదిన కేక్ కట్ చేశారు. అనంతరం అదే పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 220 మంది నిరుపేద విద్యార్థినిలకు రూ 75 వేల విలువైన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంటే ప్రేమ, అభిమానం కలిగిన ఉదాత్తమైన గుణాలు కలిగిన మహానేత ఉత్తమ్ అని ప్రశంసించారు. ప్రజలకు ఏమి కావాలో తెలుసుకొని కోరిన వెంటనే అభివృద్ధి నిధులు మంజూరీ చేస్తూ ఎనలేని ప్రజాభిమానాన్ని మూటగట్టుకున్నారని చంద్రుడికి ఓ నూలుపోగు లాగా ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉత్తమ్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం తో పాటు పాలకవీడు మండలం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్ వి సుబ్బారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి నిమా నాయక్, వైస్ ఎంపీపీ పిన్నెల్లి ఉపేందర్, బెట్టెతండా, పాలకవీడు మాజీ సర్పంచ్ లు మోతిలాల్ నాయక్ బూశిపల్లి వెంకటరెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, సైదులు, నాగరాజు, నాగయ్య, సుబ్బుగౌడ్, నాగేశ్వరరావు, సందీప్, రాము, మధు నాయక్, శ్రీకాంత్, శేషు, తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడికి భారంగా కూరగాయల ధరలు

**– ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి**
**– బ్లాక్ మార్కెట్ కు తరలి పోతున్న ఉల్లిగడ్డలు**
**– బ్లాక్ మార్కెట్ గాళ్లను కఠినంగా శిక్షించాలి**
**– సిపిఐ ధనుంజయ నాయుడు**



నేరేడుచర్ల, జూన్ 20(తీన్మార్ న్యూస్): దేశ వ్యాప్తంగా కూరగాయల ధరలు తారెత్తిస్తున్నాయని మరోవైపు టమాట ధరలు నానాటికీ దూసుకుపోతు న్నాయని రోజురోజుకూ అంతకంతకు పెరుగుతున్న ధరలతో సామాన్యుడు బెంబేలెత్తి పోతున్నాడని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. గురువారం నాడు ఆయన నేరేడుచర్ల లోని కూరగాయల మార్కెట్లో వివిధ రకాల కూరగాయల ధరల వివరాలు తెలుసుకున్న అనంతరం మాట్లాడుతూ వారం కిందటి వరకు కిలో టమాట ధర రూ.30 నుంచి రూ.50 వరకు ఉంటే ఇప్పుడు ఏకంగా రెట్టింపై రూ.100కు చేరిందని ఆకాశాన్నంటుతున్న ధరలతో ఏం కొనలేని పరిస్థితి నెలకొందని, దీంతో కూరగాయల ధరలు సామాన్యులకు మోయలేని భారంగా మారిపోయాయని అన్నారు. ప్రతి కూర లోనూ తప్పని సరిగా ఉపయోగించే టమాట ఇప్పుడు భారంగా మారుతోందని . రోజురోజుకూ పెరుగుతున్న టమాట ధరలు ఇటు ప్రజలతోపాటు అటు రీటైల్ మార్కెట్‌ను వణికిస్తోందన్నారు. గత కొద్ది రోజులుగా కూర గాయల ధరలు పెరుగుతూనే వస్తున్నాయని, ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ మార్కెట్ల లో కిలో టమాట రూ.100 పలుకుతోందని, మరోవైపు మిర్చి ధర కూడా కిలో రూ.100 దాటి. ఉల్లి ఘాటెక్కిందని,ఈసారి సకాలంలో వానలు కురవకపోవడంతో కూర గాయల ధరలు పెరుగు తూనే ఉన్నాయని . గత 15 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు అప్పటికే పొలాల్లో ఉన్న టమాట పంట దెబ్బ తిందని, టమాటనే కిలో రూ.100 ఉంటే మిగిలిన కూరగా యలు ఎలా కొనాలని సామాన్యులు వాపోతున్నారని, ఇతర రాష్ట్రాల నుంచి వెళ్లిన మరియు కూరగాయలను దిగుమతి చేసుకోవడం ద్వారా బ్లాక్ మార్కెట్ పై ఉక్కు పాదం మోపడం ద్వారా కొంతమేర తగ్గించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి అధిక ధరలపై నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కొమ్రరాజు వెంకట్, సిపిఐ నాయకులు బెల్లంకొండ గోవిందు గౌడ్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు, గుండు నాగేశ్వరరావు రామస్వామి, కొదమ గుండ్ల మట్టయ్య, సైదా నాయక్, ఘోరియా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# జీరో బిల్లు రానివారు ఎంపీడీవో కార్యాలయంలో నమోదు చేసుకోగలరు




వనపర్తి ప్రతినిధి, జూన్ 20(తీన్మార్ న్యూస్): ప్రజా పాలన లో భాగంగా విద్యుత్ 200 యూనిట్లకు మీటర్ లకు జీరో బిల్లు రాని వారు పెద్దమందడి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నమోదు చేసుకోవాలని బుధవారం ఎంపీడీవో సద్గుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధర్ కార్డు, రేషన్ కార్డు, విద్యుత్తు మీటర్ నెంబర్, ఫోన్ నెంబర్ తీసుకొని ఎంపీడీవో కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో 200 విద్యుత్తు యూనిట్లకు జీరో బిల్లు రానివారు ఎంపీడీవో కార్యాలయంలోని నమోదు చేసుకోవాలని అన్నారు.

# టీజేయు జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎండి.యూసుఫ్



రాజాపేట, జూన్ 20(తీన్మార్ న్యూస్): తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజాపేట మండలానికి చెందిన జర్నలిస్ట్ ఎండి.యూసుఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గురువారం భువనగిరి జిల్లా కేంద్రంలో ఎస్వి హెూటల్ లో యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ జర్నలిస్టు యూనియన్ సమావేశం జిల్లా అధ్యక్షులు శానూర్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్, జాతీయ కార్యదర్శి నరసింహులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నియామకంలో భాగంగా ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. యూసుఫ్ నియామకం సందర్భంగా మండల జర్నలిస్టులు మరియు ఆయా పార్టీల నాయకులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ




రాజాపేట, జూన్ 20(తీన్మార్ న్యూస్): మండలంలోని దూది వెంకటాపురం ఉన్నత ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం గ్రామానికి చెందిన నక్కీర్త కనకరాజు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 800 నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి చమకూర గోపాల్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంపిటిసి ఎర్రోళ్ల స్వరూప బాబు, నాయకులు బిక్షపతి, ధర్మారెడ్డి, రాజు, సిద్ధులు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పెబ్బేరు మండల ఎంఐఎం పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులుగా మందాపురం జయరాజ్



పెబ్బేరు, జూన్ 20(తీన్మార్ న్యూస్): ఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ,ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ ఆదేశాల అనుసారం పెబ్బేరు ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఆఫ్రోజ్ ఆధ్వర్యంలో ఎంఐఎం పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులుగా పెబ్బేరు పట్టణానికి చెందిన మందాపురం జయరాజ్ ని నియమించారు. ఎస్సి సెల్ అధ్యక్షులు జయరాజ్ మాట్లాడుతూ అసదుద్దీన్ ఓవైసీ మరియు పెబ్బేరు మండల అధ్యక్షుడు ఎండి ఆఫ్రోజ్ మరియు పెబ్బేరు మండల ఎంఐఎం పార్టీ పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతున్న నన్ను నమ్మి ఈ యొక్క పదవి బాధ్యతలు అప్పగించినదుకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎస్సి ఎస్టీ బీసీ మైనార్టీ అందరికి ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండి సేవ చేస్తానని తెలిపారు.

# నాణ్యమైన విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులు
- జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం పాల్గొన్న జిఎంఆర్
- విద్యార్థులకు యూనిఫామ్స్ పాఠ్యపుస్తకాలు పంపిణీ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వసతులు బోధనం
- సదుపాయాలలో విప్లవాత్మక మార్పులు
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి







మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, జూన్ 20(తీన్మార్ న్యూస్): విద్యార్థులకు మెరుగైన వసతులతో నాణ్యమైన విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా, దేవరకద్ర నియోజకవర్గం, చిన్న చింతకుంట మండలం, దామగ్నపూర్ గ్రామంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు, వైద్యాధికారులతో కలిసి ఆల్బెండ జోల్ మందులు పంపిణీ చేశారు. అనంతరం, విద్యార్థులకు యూనిఫామ్స్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి, గురుకుల పాఠశాలలో సీట్లు పొందిన విద్యార్థులను అభినందించి, సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతులతో నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి ఎంతోమంది ఉన్నతశిఖరాలు అధిరోహించారన్నారు. బడిబాట విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు చేపడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వసతులు, సదుపాయాలతోపాటు బోధనలో విప్లవాత్మక మార్పులు, చర్యలు చేపడుతున్నామన్నారు. తదనంతరం గ్రామంలో పద్మశాలి నగేష్ నూతన గృహ ప్రవేశ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట ఎంపిడిఓ కార్యాలయంలో అడిషనల్ డిఆర్డిఓ ప్రత్యేక సమావేశం






రామన్నపేట, జూన్ 20(తీన్మార్ న్యూస్): రామన్నపేట మండల ఎంపిడిఓ కార్యాలయంలో అడిషనల్ డిఆర్డిఓ గుర్రం సురేష్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ వచ్చే నెల మొదటి వారంలో ఎంవోఆర్డి సందర్శన సందర్భంగా చేయబోయే పనుల గురించి అనగా గుడ్ గవర్నెన్స్ పారామీటర్స్ 7 రిజిస్టర్స్, వర్క్ ఫైల్స్, అలాగే వర్క్ సైట్ బోర్డ్స్ గురించి వివరంగా తెలిపారు. ఈ సమయంలో గ్రామాలలో చేయబోయే పనుల వివరాలు కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు చేసిన 7 సిస్టర్ ను మరియు వర్క్ ఫైల్స్ ని కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాకూబ్ నాయక్ మాట్లాడుతూ సోమవారం వరకు అన్ని పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వెంకన్న అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# అక్బర్ మృతికి ఆర్థిక సాయం చేసిన జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి



వనపర్తి ప్రతినిధి, జూన్ 20(తీన్మార్ న్యూస్): పెద్దమునుగల్ చెడు గ్రామంలో, అక్బర్ మృతి పట్ల సంతాపం తెలుపుతూ, బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియపరుస్తూ ఆర్థిక సాయం చేసిన, అడ్డాకుల మండల జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి, అడ్డాకుల మండల పరిధి పెద్ద మునగాల్ చేడ్ గ్రామ వాస్తవ్యులు అక్బర్ తండ్రి ఖాజామీయా మృతి చెందినాడు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న అడ్డాకుల మండల జడ్పిటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి వారి ఆకస్మిక మృతిపట్ల విచార వ్యక్తం చేసి సంతాపం వ్యక్తం చేశారు. శోకతప్తులైన బాధిత కుటుంబ సభ్యులకు, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతిమ సంస్కరణ నిమిత్తమై ఆర్థిక సాయం చేశారు. జెడ్పిటీసీ సూచనల మేరకు గ్రామ స్థానిక నాయకులు మృతుని స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పిస్తూ ఆర్థిక సహాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో శ్రీరాములు, ఎంపిటిసి ఎం.చంద్రయ్య, మాజీ ఎంపిటిసి ఆంజనేయులు, యుగంధర్ రెడ్డి, మక్బూల్, రాజు గ్రామస్తులు,యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాత ప్రభుత్వం



నారాయణ్ పేట జిల్లా ప్రతినిధి, జూన్ 20(తీన్మార్ న్యూస్): నారాయణ్ పేట జిల్లాలో మక్తల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రైతు పక్షపాత ప్రభుత్వమని బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి నరసింహారెడ్డి అన్నారు. దేశంలో రైతులు పండిస్తున్న దాదాపు 14 రకాల పంటలకు కనీసం మద్దతు ధరను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల బిజెపి ఆధ్వర్యంలో గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మక్తల్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొత్తం 14 రకాల పంటలకు కనీస మద్దతు ధరను పెంచి రైతన్నకు భరోసాను కల్పించడం జరిగిందన్నారు. ఇందులో ప్రధానంగా వరి పంటకు రూ.117, కందులకు 550 రూపాయలు, వేరుశనగకు 406 రూపాయలు, పొద్దు తిరుగుడు కు రూ.520లు పెంచడం జరిగిందన్నారు. దీంతోపాటు మినుములు రాగులు సజ్జలు జొన్నలు మొక్కజొన్న వంటి పంటలకు మద్దతు ధరలు పెంచడం జరిగిందన్నారు. అలాగే పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం మరిన్ని నిర్ణయాలను అమలు చేస్తుందన్నారు. సమావేశంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కర్ని స్వామి, కాచ్ వార్ ఎంపిటిసి జి. బలరాం రెడ్డి, మాజీ సర్పంచ్ కుర్వ హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

# పెంచికల్ దిన్నె ఊర చెరువు కబ్జాపై సమగ్ర సర్వే

- చెరువు సొసైటీ సభ్యులు, గ్రామ యువకులు ఇచ్చిన దరఖాస్తు కు స్పందించిన అధికారులు






నేరేడుచర్ల, జూన్ 20(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండలం, పెంచికల్ దిన్నె గ్రామ ఊర చెరువు విస్తీర్ణం చుట్టుపక్కల రైతులు ఆక్రమణలు చెస్తున్నారని జిల్లా కలెక్టర్, మండల తహశీల్దార్, ఇరిగేషన్ అధికారులకు చెరువు సొసైటీ సభ్యులు, మరియు గ్రామానికి చెందిన యువకులు వూట్కూరి భార్గవ్ సైదులు, సిరికొండ రామకృష్ణ, నాయిని సైదులు దరఖాస్తులు ఇవ్వగా ఇరిగేషన్ అధికారుల సిఫారసు మేరకు గురువారం చెరువు చుట్టూ సర్వే నిర్వహించారు. ఇరిగేషన్ ఏ.ఇ.రాజేశ్వరి పర్యవేక్షణలో మండల సర్వేయర్ గాయత్రి సర్వేచేయగా సొసైటీ సభ్యులు పలువురు గ్రామస్తులు రైతులు హాజరైనారు. ఇట్టి సర్వే పూర్తి వివరాలు త్వరలో వెల్లడించి హద్దులు నిర్ధారించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజమూరు వెంకటయ్య, ఎడవల్లి వెంకటకృష్ణ, సిరికొండ మట్టయ్య, పసుపులేటి నరసింహారావు, సొసైటీ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం




తాడ్వాయి, జూన్ 20 (తీన్మార్ న్యూస్): తాడ్వాయి మండల వ్యాప్తంగా 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలో, కాటాపూర్, కొడిశెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్య సిబ్బంది వైద్యులు మండలంలోని అన్ని అంగన్వాడి కేంద్రాలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ఉన్న విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు ఎటువంటి హాని చేయదని ప్రతి ఆరు నెలలకు ఒకసారి పిల్లలకు ఆల్బెండజోళ్ళ మాత్రలు వేయడం వల్ల కడుపులో పెరిగే నట్టలను పూర్తిగా నివారించే అవకాశాలు ఉంటుందన్నారు. ఈ మాత్రల వల్ల పిల్లల్లో వచ్చే రక్తహీనత పోషకాహార లోపం ఆకలి లేకపోవడం బలహీనత బరువు తగ్గడం కడుపునొప్పి ఇలాంటి వాటిని వివరించవచ్చని మండల వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. మండలంలో డివార్మింగ్ డే ర్యాలీ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లు మౌనిక, రంజిత్, సిగ్ధా, గౌతమ్, పవన్, డిపిఎమ్ఓ సంజీవరావు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ టీచర్లు, ప్రజాప్రతితులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన కలెక్టర్ ఆదిత్య సురభి కి సన్మానం

- జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధ



వనపర్తి ప్రతినిధి, జూన్ 20(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లాకు నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆదిత్య సురభి ను జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధా మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. అదేవిధంగా వనపర్తి జిల్లాలోని ఆశ వర్కర్ల జీతాల పెంపకం, గురించి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి పిలుపు మేరకు, రాష్ట్రంలో ప్రతి జిల్లాలో పిలుపునిచ్చారు. రాష్ట్ర కోశాధికారి జ్యోతి రమణ, బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు అశ్విని రాధ, మాజీ జిల్లా అధ్యక్షురాలు వారణాసి కల్పన, బిజెపి కార్యదర్శి పద్మ, జిల్లా కార్యదర్శి సుగురు లక్ష్మి, జి.కవిత, పలు సమస్యలపై కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, రాష్ట్ర కోశాధికారి జ్యోతి రమణ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధ, మాజీ జిల్లా అధ్యక్షులు వారణాసి కల్పన, బిజెపి కార్యదర్శి పద్మ, జిల్లా కార్యదర్శి రఘురాం లక్ష్మి, జి.కవిత, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఆశయాల కోసం పాటుపడుతా

- జర్నలిస్టుల ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరగని పోరాటం
- జర్నలిస్ట్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికపై అభినందనలు వెల్లువ
- రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కి, విరహత్ అలీ కి కృతజ్ఞతలు
- వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఐజేయు రాష్ట్ర కార్యదర్శిగా గుండ్రాతి మధు గౌడ్



వనపర్తి ప్రతినిధి, జూన్ 20(తీన్మార్ న్యూస్): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఆశల కోసం కృషి చేస్తానని, జర్నలిస్టుల ఐక్యత కోసం పాటుపడతానని జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ అన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఐజేయూ ఆధ్వర్యంలో తృతీయ మహాసభలు ఖమ్మం లో అట్ట హస్యంగా ప్రారంభమయ్యాయి. తృతీయ మహాసభల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ వర్కింగ్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఐజేయు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఐజేయు నాయకత్వంలో జర్నలిస్టులో ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన జర్నలిస్టులను గుర్తించిన యూనియన్ నాయకులు, వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న గుండ్రాతి మధు గౌడ్ గా పనిచేస్తున్న మధు గౌడ్ ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన గుండ్రాతి మధు గౌడ్ ను జర్నలిస్ట్ నాయకులు పూలమాలలు, శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మధు గౌడ్ మాట్లాడుతూ అర్హులైన వర్కింగ్ జర్నలిస్ట్ అందరికీ ఏ సమస్య వచ్చిన వెంటంటూ ఉంటామని, పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం జర్నలిస్టుల కోసం ప్రవేశపెట్టే ఏ పథకంలోనైనా ప్రతిఫలం అందించేందుకు కృషి చేస్తానన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేసినందున యూనియన్ నాయకులు విరహత్ అలీ, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కి మధు గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. మాధవరావు జాతీయ కౌన్సిల్ మెంబర్ నోముల రవీందర్ రెడ్డి, ప్రశాంత్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రమేష్, సీనియర్ జర్నలిస్ట్, మాజీ జాతీయ కౌన్సిల్ మెంబర్ మల్యాల బాలస్వామి, జిల్లా జర్నలిస్టు నాయకులు కొండన్న యాదవ్,నక్క కృష్ణ యాదవ్,నవీన్ గౌడ్, గంధం దినేష్, ఆంజనేయులు, యాకూబ్, తదితరులు అభినందనలు తెలిపారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించండి

విద్యా వ్యాపారాన్ని అరికట్టండి

పర్మిషన్ లేని స్కూళ్ళను సీజ్ చేయండి

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కుమ్మరి సాగర్




ములుగు జిల్లా, జూన్ 20 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా వ్యాపారానికి తెర లేపాయని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ విద్యాశాఖ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నారని జిల్లా లో అలాంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి సాగర్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులను కోరారు. గురువారం రోజున ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిబంధనలు పాటించని ప్రయివేటు విద్యాసంస్థలను గుర్తించి,పర్మిషన్ లేకుండా నడుస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలని, యూనిఫామ్ పుస్తకాల పేరుతో దోపిడీ చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డీఈవో ఫణికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అనుముల రాజకుమార్, మాతంగి మోహన్, త్రికోవల వేణు, దేవరాజ్, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్లంకి గ్రామంలో పంట నమోదు పర్యవేక్షణ

**– సందర్శించిన మండల వ్యవసాయ అధికారి ఎస్. పద్మజ**



రామన్నపేట, జూన్ 20(తీన్మార్ న్యూస్): మండలంలోని వెల్లంకి గ్రామంలో పంట నమోదు పర్యవేక్షణ కార్యక్రమలో భాగంగా వ్యవసాయ అధికారి ఎస్. పద్మజ సందర్శించారు. గ్రామంలో సందర్శించి నారుమడి యాజమాన్యం గురించి వివరించి రైతులకి సూచనలు చేశారు. నారుమడిని 10–12 రోజుల వ్యవధిలో 3 దఫాలు దమ్ము చేసి చదునుచేయాలి. నాటు వేసిన తర్వాత 2 మీ. కు ఒక కాలిబాటను తీయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలిబాటలు తీయాలి. దీనివలన గాలి బాగా తగిలి దోమపోటు ఉద్రితి తగ్గడం జరుగును. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (1 కిలో విత్తనం చల్లేముందు మరో కిలీ విత్తిన 12–14 రోజులకు), 1కిలోభాస్వరం, 1కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. 3 గ్రా కార్బండజిమ్ తో 1 కిలో విత్తనానికి చేయాలి. కార్బండజిమ్ కలిపిన తర్వాత 24 గంటలకు నారుమడిలో చల్లుకోవాలి. దుంప నారుమళ్ళకు అయితే 1 లీటరు నీటికి, 1 గా). కార్బండజిమ్ కలిపి విత్తనాలను అందులో వేసి 24 గంటలు నానబెట్టి 24 గంటలు మండె కట్టి మొలకలను చలుకోవాలి. నారుమడిలో దీనితో అన్ని రకాల శిలీంధ్రం లను, తెగుళ్ళను అరికట్టవచ్చు. మొలకెత్తిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోలు చొప్పున చల్లుకోవాలి. నారు, ఒక ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు 6 తడులు ఇచ్చి తర్వాత పలుచగా నీరు కట్టాలి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3g గుళికలు సెంటునారుమడికి 160 గ్రా చొప్పున వేయాలి లేదా) నారు తీయడానికి 7 రోజులముందు గుళికలు వేసి నాననివ్వాలి. (లేదా) నారు కట్టలను ఒక మడిలో గుళికలు వేసి ఒకరోజు నాననివ్వాలి.

నారు కొనలు తుంచి ప్రధానపొలంలో నాటుకోవాలి. ఇలా చేయడం వలన పురుగుల ఉధృతిని 80% వరకు తగ్గించుకోవచ్చు. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2గ్రా. జింకు సల్ఫేటు ద్రావణాన్ని పిచికారి చేయాలి. నారు మడి లో కాండము తొలుచు పురుగు తల్లి పురుగు లు, గుడ్ల గుంపు లు కనిపించినపుడు వేప నూనె ను 5 మి.లీ. ఒక లీటరుకు చొప్పున పిచికారీ చేయాలి. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి కృష్ణ, రైతులు ఎల్లయ్య, గణేష్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వరదల వల్ల నష్టం కలగకుండా చూడాలి

**ప్రణాళిక బద్దంగా వరదల బారి నుండి ప్రజలను రక్షించాలి**

**పునరావాస కేంద్రాలు సిద్ధం చేసుకోవాలి**

**ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు, జూన్ 20 (తీన్మార్ న్యూస్): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వరదల వల్ల నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్షాలు, వరదల పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, సి.హెచ్. మహేందర్ జి, డి ఎఫ్ ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వరదల వల్ల నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. గత సంవత్సరం సాధారణ కంటే ఎక్కువ వర్షాలు కురవడం వల్ల వరదలు వల్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. జిల్లాలో ఎక్కువ వాగులు, గోదావరినది ఉందని ఎగువ కురిసిన వర్షాలకు ఉధృతంగా వరదలు సంభవిస్తాయని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులను సూచించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండలాలలో గత మూడు సంవత్సరాలుగా వర్ష పాతం నమోదైన ప్రాంతాలను గుర్తించి నివేదికలు తప్పులు లేకుండా తయారు చేయాలని అన్నారు. వరదలు సంభవించినప్పుడు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టే విధంగా సిద్ధంగా ఉండాలాన్నారు. గ్రామ స్థాయిలో పంచాయితీ సెక్రటరీ లు అందుబాటులో ఉండాలని గ్రామ స్థాయిలో మొబైల్ టీమ్ ను ఏర్పాటు చేయాలని, గ్రామ స్థాయిలో పంచాయితీ సెక్రటరీలు, ప్రజా ప్రతినిధులు, మహిళా సమాక్య సభ్యులు, రేషన్ డీలర్లను, యువతను సమన్వయ పరుస్తూ ప్రణాళిక బద్దంగా గ్రామాలలో వరద ఉధృతి కి కారణమయ్యే ప్రాంతాలు, గుర్తించాలని సూచించారు.

# గ్రామాలలో ప్రతి ఇంటికి త్రాగునీరు అందించాలి

**మిషన్ భగీరథ మొబైల్ సర్వే ప్రక్రియను ఆకస్మిక తనిఖీ**

**పొరపాట్లు జరగకుండా సర్వే పూర్తి చేయాలి**

**ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు, జూన్ 20 (తీన్మార్ న్యూస్): గ్రామాలలో ప్రతి ఇంటికి త్రాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వెంకటాపురం మండల కేంద్రంలో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిషన్ భగీరథ మొబైల్ అప్లికేషన్ సర్వేయర్ తో మాట్లాడుతూ వివరాలు నమోదు చేసేటప్పుడు ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, సర్వే సమయంలో ఇబ్బందులు ఎదురైతే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామాలలో నిరంతరం నూతన గృహాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటికి త్రాగునీరు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం మిషన్ భగీరథ సర్వేను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నల్లాల పనితీరు, నల్లల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా లేదా, కలుషితమైన నీరు వస్తుందా, కుటుంబ సభ్యులకు సరిపడా నీరు వస్తున్నాయా లేదా అనే అంశాలను స్థానిక గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల ప్రత్యేక అధికారిని స్వర్ణ లత లేనిన తహసిల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంపిఓ హనుమంతరావు, మిషన్ భగీరథ డి ఈ వెంకట సతీష్, ఏఈ శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగులను నిర్మూలిద్దాం.. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుదాం

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య**





ములుగు, జూన్ 20 (తీన్మార్ న్యూస్): జాతీయ నులిపురుగుల దినోత్సవంను పురస్కరించుకొని ములుగు మండలంలోని బండారుపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ లో నులిపురుగుల నిర్మూలన దినోత్సవంను ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా 19 సంవత్సరాల లోపు వయసు కలిగిన విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరిగింది. ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్యం పై నులిపురుగుల యొక్క ప్రభావం రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, బలహీనత మరియు ఆందోళన కడుపునొప్పి, వికారము, వాంతులు, విరేచనాలు బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఏర్పడతాయని, వీటిని నివారించాలంటే పిల్లలందరూ ఆల్బెండజోన్ టాబ్లెట్లు వేసుకోవాలని తెలిపారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రణధీర్ మాట్లాడుతూ, జిల్లాలో 611 అంగన్వాడి సెంటర్లలో 13,349 మంది లబ్ధిదారులు ఉన్నారని ప్రభుత్వ మరియు ప్రైవేటు స్కూళ్లలో 73,544 మంది లబ్ధిదారులు ఉన్నారని, వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందని తెలిపారు. నులిపురుగుల నివారణకు ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాలయాలో ఉపాధ్యాయులు అంగన్వాడీ సెంటర్లలో పని చేస్తున్న సిబ్బంది అందరూ సహకరించాలని కోరారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడుతూ నులిపురుగుల సంక్రమణ వల్ల విద్యార్థులలో చదువుపై ఆసక్తి తగ్గుతుందని,పోషకాహార లోపంతో వచ్చే అనీమియా లాంటి వ్యాధులు ఏర్పడతాయని, ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాయని గూడెం వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం వైద్యాధికారులు మల్లికార్జున్, శ్రీలత, కార్యాలయ సిబ్బంది డెమో తిరుపతయ్య, మానిటరింగ్ సూపర్వైజర్స్ సంపత్, దుర్గారావు, భాస్కర్, సంపత్రావు, డిపిఎమ్ఓ సాంబయ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాయని గూడెం వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మోడల్ స్కూల్ లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ స్కూల్ నిర్వహణకు అంగన్వాడీలకు శిక్షణ

**సీడీపీఓ గొర్ల మల్లీశ్వరి ఆధ్వర్యంలో ప్రారంభమైన శిక్షణ**



తాడ్వాయి, జూన్ 20 (తీన్మార్ న్యూస్): నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూల్ లుగా తీర్చిదిద్దటానికి గాను అంగన్వాడీ టీచర్స్ కు శిక్షణ ఇవ్వటం జరుగుతున్నది. శిక్షణ ఇవ్వటంలో భాగంగా గురువారం ములుగు జిల్లా తాడ్వాయి ప్రాజెక్ట్ లో సీడీపీఓ గొర్ల మల్లీశ్వరి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన్ హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా తాడ్వాయి ప్రాజెక్ట్ పరిధిలోని తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల అంగన్వాడీ టీచర్లను 3 బ్యాచ్ లుగా చేసి 3 రోజులు శిక్షణ ఇస్తున్నామని, ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫామ్ కూడా అందజేస్తామని తెలిపారు.పూర్తి శిక్షణ పొందిన టీచర్స్ తో ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఎలాంటి ఖర్చు లేకుండా అమ్మఒడిలాంటి అంగన్వాడీ కేంద్రంలో 3 నుండి 5 సంవత్సరాల పిల్లలను చేర్పించాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక వాచకం –1, పూర్వ ప్రాథమిక విద్యా కరదీపికలను అందజేశారు. సూపర్ వైజర్ ఆర్ శారద, అంగన్వాడి టీచర్ టీ పద్మారాణి లు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మెదడు అభివృద్ధి ప్రక్రియ, పూర్వ బాల్య ఆరంభం, పిల్లల సమగ్ర అభివృద్ధిలో పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యత అభ్యసలు అభ్యసన మూలాలు తరగతి నిర్వహణ పిల్లల అభివృద్ధి పరిశీలన జూన్ జూలై నెలలకు సంబంధించిన సిలబస్ మొదలైన అంశాలపై అంగన్వాడి టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్లు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిరుమర్తి లింగయ్య చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మరు

**– కెసిఆర్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదు**

**– మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేతలు**



నకిరేకల్ ప్రతినిధి, జూన్ 20(తీన్మార్ న్యూస్): నల్గొండ జిల్లా, నకిరేకల్ లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు చిరుమర్తి లింగయ్య చేసిన వ్యాఖ్యలను తప్పు బట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను వందకు వంద శాతం అమలు చేస్తుందని వారు తెలిపారు. చిరుమర్తి లింగయ్య కాంగ్రెస్ పార్టీపై చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నాడని వారు ఆరోపించారు.



తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఎన్నికల్లో కెసిఆర్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు.దళిత ముఖ్యమంత్రి దళితులకు మూడు ఎకరాల భూమి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, బ్రాహ్మణ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు, పిలాయిపల్లి కాల్వ, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకు రాలేదో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి కాలేదని 10 సంవత్సరాలలో మీరు ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని వారు ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన పద్ధతి మార్చుకోవడం లేదని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మీద మాట్లాడే నైతిక హక్కు చిరుమర్తి లింగయ్యకు లేదని వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్షతోటే చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్యే అయ్యాడని ఆ సంగతి మర్చిపోవద్దని వారు హెచ్చరించారు.

# జాతీయ నులి పురుగుల దినోత్సవం

**– ఇంద్రపాలనగరం ప్రభుత్వ పాఠశాలలో మాత్రల పంపిణి**



రామన్నపేట, జూన్ 20(తీన్మార్ న్యూస్): మండలంలోని ఇంద్రపాల నగరంలో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మాత్రల పంపిణి కార్యక్రమంను ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ పూస బాలామణి బాల నర్సయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 1 నుండి 19 సం,, లోపు పిల్లలకు అల్బెండేజోల్ మాత్రలు వేయడం జరిగిందని, తద్వారా పిల్లలలో నులి పురుగల నిర్మూలన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మునిపంపుల వైద్య అధికారి డాక్టర్ అశ్విని కుమార్, హెచ్ఈఓ గోపాల్, ఎం ఎల్ హెచ్ పీ జ్యోతి, ఏఎన్ఎం అరుంధతి, మరియు ఆశలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ను మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహించినట్టు తెలిపారు. వివిధ గ్రామాల నందు వివిధ ప్రజా ప్రతినిధులు, వైద్య సిబంది, పాఠశాలల





ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నట్టల నివారణ మందులు పంపిణీ





టేక్మల్, జూన్ 20(తీన్మార్ న్యూస్): మెదక్ జిల్లా, టేక్మాల్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తంపులూర్ గ్రామంలో గురువారం రోజు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా తంప్లూర్ జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులకు నట్టల నివారణ కు ఆల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణి చేశారు. నట్టల నివారణతో పాటు రక్తహీనతను కాపాడుకోవడానికి ఈ కార్యక్రమంలో వివరించారు. ఈ కార్యక్రమానికి జెడ్పిటిసి సరోజా మల్లేశం, డాక్టర్ షఫిక్ అహ్మద్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి పి.సుగుణాకర్,ఆశా కార్యకర్తలు, మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల మోత..

## భరించేది ఎలా

హైదరాబాద్: ఇంగ్లీషు మీడియంపై మోజు, కార్పొరేటు స్కూళ్లపై వ్యామోహంతో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లల్లో చేర్పిస్తున్నారు. ఖర్చు ఎంతైనా పర్లేదు? తమ బిడ్డల భవిష్యత్ బాగుండాలని ఆరాటపడుతున్నారు. ఎన్ని కష్టాలు భరించైనా సరే?. యాజమాన్యాలు నిర్ణయించిన ఫీజులను చెల్లిస్తున్నారు. ఇక ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల సంగతి చూస్తే?. నిర్ణయించిన ఫీజు కంటే ఒక్క రూపాయి కూడా తక్కువ తీసుకునే పరిస్థితి ఉండదు. తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రతి ఏడాది కూడా ఫీజులు పెంచుతూ? రకరకాల కారణాలు చెబుతున్నారు. ఫీజులు మాత్రమే కాకుండా? పుస్తకాలతో పాటు స్టేషనరీ అంటూ మరో రూపంలో కూడా దండుకునే పనిలో ఉంటున్నారు. మరోవైపు ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు, నిబంధనలు తీసుకొచ్చినప్పటికీ?. వీరి దూకుడుకు కళ్లెం వేయలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. విద్యార్థుల నుంచి వేలకు వేల రూపాయలను ఫీజులుగా తీసుకుంటున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మౌలిక వసతుల కల్పన విషయంలో మాత్రం ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. బిల్డింగ్ నిర్వహణ నుంచి టీచర్ల జీతాల వరకు ఏ విషయం తీసుకున్నా?. లోపాల పుట్ట బయటపడే పరిస్థితులు ఉన్నాయి. హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని చాలా పట్టణాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాలలు ఇరుకైన భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. 90 శాతం స్కూళ్ల పరిస్థితి ఇలాగే ఉంది. ఇరుకైన గదుల్లోనే తరగతులు జరుగుతున్నాయి. అందులోనూ సెక్షన్ వారీగా విభజిస్తూ? భవనమంతా పిల్లలతో కిక్కిరిసిపోయి ఉంటున్నాయి. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరం. వాటితోనే మానసికోల్లాసం కలుగుతుందని, దేహధారుఢ్యం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నప్పటికీ పెడచెవిన పెట్టేస్తున్నారు. ఎక్కువ సమయం స్కూల్ లోనే గడిపేస్తూ? పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఎంతసేపు చదువే ముఖ్యం అన్నట్లు? పాఠశాలలు వ్యవహరిస్తున్న తీరు ఉంటోంది. క్రీడా వసతులు లేక పలు రకాల ఆటలపై మక్కువ ఉండే విద్యార్థులు కూడా వెనకడుగు వేసే పరిస్థితులు ఉంటున్నాయి. ఓవైపు యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు?. విద్యార్థులకు కనీస వసతలు కల్పించడంలో విఫలమవుతున్నాయి. ఐదో తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు కొన్ని రకాల ప్రయోగాత్మక (సైన్స్) పాఠాలు ఉంటాయి. వీటికి థియరీ క్లాసులు మాత్రమే చెబితే సరిపోదు. తప్పనిసరిగా ల్యాబ్ పాఠాలు ఉండాలి. అందులో మెరుగైన బోధన పరికరాలు ఉండేలా చూసుకోవాలి. దీనికంటూ ఓ ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. కానీ చాలా ప్రైవేటు బడుల్లో ఇలాంటి వాటికి చోటు ఉండటం లేదు. ఈ విషయంలో ప్రభుత్వ బడులు ముందంజలో ఉంటున్నాయి. ప్రతి బడిలోనూ గ్రంథాలయం ఉండాలి. చాలా బడుల్లో నామమాత్రంగా సింగిల్ రూమ్ లోనే ఏర్పాటు చేస్తూ? లెక్కలు చూపించుకుంటున్నారు. కొన్నింటిలో వాటి జాడే ఉండటం లేదు. ప్రైవేటు బడుల్లో అతిపెద్ద సమస్య శుభ్రమైన మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవటం?! వందలాది మంది విద్యార్థులు ఒకే భవనంలో ఉంటున్నప్పటికీ? వారి సంఖ్యకు అనుగుణంగా వీటి నిర్మాణాలు ఉండటం లేదు. ఫ్లోర్ల వారీగా ఏర్పాటు చేస్తున్నప్పటికీ? ఇవి ఏ మాత్రం సరిపోలేని పరిస్థితులు ఉంటున్నాయి. ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బాలికలు చాలా సమస్యలను ఫేస్ చేస్తున్నారుచాలా ప్రైవేటు పాఠశాలలకు శాశ్వత భవనాలు ఉండటం లేదు. అద్దెకు భవనాలు తీసుకుంటూ నడిపిస్తున్నారు. గాలి, వెలుతురు కూడా సరిగా లేని బడులు చాలాచోట్ల దర్శనమిస్తున్నాయి. కొన్ని బడులకు ఫైర్ సెఫ్టీ సర్టిఫికెట్ లు కూడా ఉండటం లేదు. ప్రైవేట్/ కార్పొరేట్ బడుల్లో భారీగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా డొనేషన్ పేరుతో రాబడుతున్నారు. దీనికి సంబంధించి ఏ ఒక్క కాగితం కూడా ఉండదు. కేవలం స్కూల్ ఫీజుకు మాత్రం రశీదులు ఇస్తున్నారు. చట్ట ప్రకారం? డొనేషన్ లు తీసుకోవటం నిషేధం. కానీ దాదాపు అన్ని ప్రైవేటు బడులు? డొనేషన్ల పేరుతో కోట్ల రూపాయలను వెనక్కి వేసుకుంటున్నాయి. ఓవైపు డొనేషన్లు.. మరోవైపు ఫీజులు వసూలు చేసుకుంటూనే? అందులో పని చేసే టీచర్లకు మాత్రం అంతంతే అన్నట్లు జీతాలను చెల్లిస్తున్నారు. బీఈడీ, పీజీలు చేసి నైపుణ్యం ఉన్న టీచర్లకు కూడా తక్కువ జీతాలే ఇస్తున్నారు. కొన్ని ప్రీ ప్రైమరీ స్కూళ్లలో 5 నుంచి 15 వేల జీతంతోనే పలువురు టీచర్లు పని చేస్తున్నారు. ప్రైమరీ, హై స్కూల్ కు భోదించే టీచర్లకు రూ. 15 నుంచి రూ. 30 వేల లోపే చెల్లిస్తున్నారు. కొన్ని కార్పొరేట్ స్కూళ్లలో పని చేసే టీచర్లకు మాత్రం? రూ. 30 వేలకు జీతం ఇస్తున్న పరిస్థితులు ఉన్నాయి. చాలా బడుల యాజమాన్యాలు సకాలంలోనే విద్యార్థులు నుంచి ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ టీచర్లకు మాత్రం సకాలంలో ఇవ్వటం లేదు. నెల పూర్తి అయిన వారం నుంచి పది రోజులలోపు చెల్లిస్తున్నారు. ప్రైవేటు బడుల్లో పని చేసే చాలా మంది టీచర్లకు పీఎఫ్, ఆరోగ్య బీమా వంటి సౌకర్యం కూడా ఉండటం లేదు. కనీసం వీరి సమస్యల గురించి మాట్లాడే పరిస్థితి కనిపించటం లేదు. ఇక వేసవి సెలవులు వస్తే పూర్తిగా జీతాలు ఉండవు. ఈ టైంలో టీచర్ల చెప్పలేనన్నీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులను ఆకర్షించేందుకు రకరకాల పేర్లతో పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారు. మెయిన్ బ్రాంచ్ ఒక చోట ఉంటే? ఆ క్యాంపస్ కు అనుగుణంగా మరికొన్ని బడులు ఉంటున్నాయి. వీటిని ఒలంపియాడ్, టెక్నో, డిజిటల్, ఇంటర్నేషనల్, ఫౌండేషన్ వంటి రకరకాల పేర్లతో నడిపిస్తున్నారు. ఒక్కో క్యాంపస్ లో ఒక్కో విధంగా ఫీజులను వసూలు చేస్తున్నారు. చట్టప్రకారం? ఇలాంటి తోక పేర్లతో పాఠశాలలను నిర్వహించవద్దని ప్రభుత్వం పలుమార్లు ఆదేశాలు కూడా ఇచ్చింది.

కానీ తమను ఆపేది ఎవరన్నట్టు? పలు ప్రైవేటు బడుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ముందుకెళ్తున్నాయి. పేరేంట్స్ కమిటీలు పేరుకే అన్న చందంగా మిగిలిపోతున్నాయి. ప్రైవేటు బడుల నిర్వహణ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ఆశించిన మేర అమలు కావటం లేదు. ఫీజుల నియంత్రణ నుంచి బడుల్లో మౌలిక వసతులు, టీచర్ల నియాకం వరకు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభం దశలోనే తనిఖీలు కాకుండా? నిరంతరం జరిపేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రైవేటు బడులపై నిఘా వ్యవస్థ ఉండాలని? యథేచ్ఛగా ఫీజులు వసూలు చేసే బడులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రైవేటు బడుల్లో మౌలిక వసతుల కల్పనపై హిందుస్థాన్ టైమ్స్ తెలుగుతో ఉస్మానియా వర్శిటీ విద్యార్థి సంఘం నాయకుడు చటారి దశరథ్ మాట్లాడారు. ప్రైవేటు బడులు ఇష్టారాజ్యాంగా అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. డొనేషన్లపై నిషేధం ఉన్నప్పటికీ?. భారీ స్థాయిలో తీసుకుంటున్నారని చెప్పారు. ప్రైవేటు బడుల ప్రాంగణంలో బుక్స్, స్టేషనరీ అమ్మవద్దని ఆదేశాలు ఉన్నప్పటికీ? చాలా బడులు ఈ తంతును కొనసాగిస్తున్నాయని తెలిపారు."హైదరాబాద్ నగరంలో ప్రైవేటు బడుల నిర్వహణ దారుణంగా ఉంటోంది. ఇరుకైన భవనాల్లో తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస మౌలిక వసతులు కూడా కల్పించటం లేదు. టెట్ అర్హత సాధించిన వారినే టీచర్లుగా రిక్రూట్ చేసుకోవాలి. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. ప్రైవేటు టీచర్లు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారికి పే స్కేల్ అమలు చేయాలి. ఆరోగ్య బీమా వంటి సౌకర్యం కల్పించాలి. నిబంధనలు పాటించని స్కూళ్ల అనుమతులను రద్దు చేయాలి. ఫీజుల దోపిడిని నియంత్రించేందుకు సమగ్రమైన చట్టం తీసుకురావాలి" అని దశరథ్ అభిప్రాయపడ్డారు.

# మండలిలో గుత్తాపై అవిశ్వాస తీర్మానం...?

హైదరాబాద్: అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మరో పొలిటికల్ ఫైట్‌కు తెలంగాణ శాసన మండలి వేదికకానుందా? చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ అధిష్టానం రెడీ అవుతోందా? అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగలడంతో మండలిలో గుత్తాపై అవిశ్వాస తీర్మానం వైపు బీఆర్ఎస్ మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉంటున్న శాసన మండలి చైర్మన్ గుత్తాకు వ్యతిరేకంగా అవిశ్వాసం నెగ్గితే రాజకీయంగా పైచేయి చాటుకోవచ్చని బీఆర్ఎస్ అధిష్టానం ఉవ్విళ్లూరుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో శాసన మండలిలో తమ బలాన్ని పెంచుకునేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ కు సన్నద్ధమవుతోందన్న టాక్ వినిపిస్తోంది. మొత్తానికి మండలి ఛైర్మన్ గుత్తాపై బీఆర్ఎస్ పెట్టనున్న అవిశ్వాస తీర్మానం, దీన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ అనుసరించనున్న వ్యూహాలు.. తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి.. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారన్న వార్తలు రావడంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. మండలి చైర్మన్ పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం పెడితే ఆ పార్టీకి ఉన్న సంఖ్యా బలంతో తేలికగా నెగ్గుతుంది. సభలో బీఆర్ఎస్ ఆధిపత్యాన్ని గండి కొట్టేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష వైపు మొగ్గు చూపుతోంది. బీఆర్ఎస్ నుంచి 14 మంది ఎమ్మెల్సీలను చేర్చుకుంటే మండలిలో కాంగ్రెస్ సంఖ్యాబలం 20కి చేరుకుంటుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. మొత్తం మీద మండలి చైర్మన్ గుత్తాపై పెట్టానున్న అవిశ్వాస తీర్మాన రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవిశ్వాస తీర్మానాలతో అన్నింటిని కైవసం చేసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికలు విజయ దుందిభీ మోగించిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఆశించిన పెర్ఫామెన్స్ ప్రదర్శించ లేకపోయింది. మరోవైపు బీఆర్ఎస్ కు ఒక్క సీటు కూడా రాకుండా కాంగ్రెస్ ఖంగు తినిపించింది. శాసనసభలో బలం లేకపోయినా.. పెద్దల సభ శాసనమండలిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని బిఆర్ఎస్ భావిస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్, బిజెపిల వైపు గోడ దూకేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉండడం, పార్లమెంట్ ఎన్నికల టైంలో సుఖేందర్ రెడ్డి కొడుకు అమిత్ రెడ్డి కాంగ్రెస్ చేరడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలవేళ బీఆర్ఎస్‌లోని గుత్తా అనుచరులు మొత్తం గంపగుత్తగా కాంగ్రెస్ చేరారు. తొలుత అమిత్ రెడ్డి నల్గొండ, భువనగిరి నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఆశించగా.. ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ మాజీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పెద్దలకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుఖేందర్ రెడ్డి.. కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఫైర్ అయ్యారు. కేసిఆర్ చెప్పుడు మాటలు వినడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని ఎంపీ ఎన్నికల సమయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. ఈ పరిణామాల నేపథ్యంలో సుఖేందర్ రెడ్డిని చైర్మన్ పదవి నుంచి దింపాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు పొలిటికల్ సర్కిల్స్ లో టాక్. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో నెగ్గడం ద్వారా అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేయవచ్చునే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతోందట. గుత్తాపై అవిశ్వాస తీర్మానంలో నెగ్గితే ఓ రకంగా రేవంత్ రెడ్డి దూకుడుకు చెక్ పెట్టినట్టేనని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి..తెలంగాణ శాసన మండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40 కాగా, ప్రస్తుతం రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు మినహాయిస్తే ప్రస్తుతం మండలిలో 38 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. మండలి చైర్మన్ పదవి నుంచి దింపడానికి మొత్తం సభ్యుల్లో 2/3 వంతు మెజార్టీ ఉండాలి. ప్రస్తుతం 27 మంది సభ్యులు అవిశ్వాసానానికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పక్షాన 31 మంది ఎమ్మెల్సీలు ఉన్నట్టు మండలి రికార్డులు చెప్తున్నాయి. కానీ దామోదర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ ఎమ్మెల్సీగా గెలిచారు. చైర్మన్ సుఖేందర్ రెడ్డితో కలిపితే కాంగ్రెస్ సంఖ్య ఆరుకు పెరిగింది. వీరిని మినహాయిస్తే బీఆర్ఎస్ తరపున 26 మంది ఉంటారు. ఎంఐఎంకు ఇద్దరు ఎమ్మెల్సీలు ఉండగా, బీజేపీ కి ఒకరు ఉన్నారు. టీచర్ ఎమ్మెల్సీలు ఇద్దరు ఓటింగ్ కు దూరంగా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి శాసనసభలో తిరుగులేని బలం ఉన్నా.. మండలిలో మాత్రం బీఆర్ఎస్ పార్టీదే పైచేయిగా ఉంది. పలు కీలక బిల్లుల ఆమోదం, ఇతర అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అడ్డంకిగా మారే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శాసనమండలిలో 'ఆపరేషన్ ఆకర్ష కు సిద్ధమవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రాష్ట్రం ఏర్పడినపుడు శాసనసభలో బీఆర్ఎస్ కు తిరుగులేని బలం ఉన్నా.. శాసన మండలిలో మాత్రం కాంగ్రెస్‌దే ఆధిపత్యం ఉండేది.

# గోదావరి కరకట్ట నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలి





## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

## ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

మంగపేట, జూన్ 20 (తీన్మార్ న్యూస్): గోదావరి కరకట్ట నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం మంగపేట మండల కేంద్రంలోని గోదావరి నది కరకట్టను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పరిశీలించారు. కరకట్ట నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 64 కోట్ల రూపాయల నిధులతో 2.5 కిలోమీటర్ల పొడవుతో కరకట్ట నిర్మాణం పూర్తి అయితే గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామలు సురక్షితంగా ఉంటాయని, కరకట్ట నిర్మాణంలో ఉపయోగించే ముడి సరుకు నాణ్యతను అధికారులు పరిశీలించాలని కాంట్రాక్టర్లు , అధికారు లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల తహసిల్దార్ వీరస్వామి ఇరిగేషన్ డిఈ రవికుమార్, ఏఈ వలి మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ అభిమానులు అన్నదాన కార్యక్రమం





గరిడేపల్లి, జూన్ 20(తీన్మార్ న్యూస్): జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విజయానికి గుర్తుగా అన్నదానం ఏర్పాటు చేశారు. గురువారం గరిడేపల్లి మండలకేంద్రంలో గల సాయిబాబా ఆలయంలో పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా, పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా నేరేడుచర్ల, గరిడేపల్లి జనసైనికులు కలిసి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హుజూర్నగర్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ సరికొప్పుల నాగేశ్వరరావు, ఆలయ నిర్వహకులు రవిబాబు, నేరేడుచర్ల జనసేన యువకులు కోమ్మరాజు శ్రీను, అనిల్ నాయుడు, చందు, సాయి చరణ్, సాయి, వాసు నాయుడు, ప్రసాద్, భాను, గరిడేపల్లి జనసేన యూత్ నరసింహ చారి, నరేష్, సతీష్, కరుణాకర్, శివ, అంజి, వీరబాబు, మరియు భక్తులు పాల్గొన్నారు.

# ఇకపై ప్రకటనలకు స్వీయ ధ్రువీకరణ తప్పనిసరి

హైదరాబాద్: ఇకపై ప్రకటనలకు స్వీయ ధ్రువీకరణ తప్పనిసరి ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలను జారీ చేయాలంటే. ప్రకటనలు ఇచ్చే వ్యాపార సంస్థలు, వ్యక్తులు ఇకపై స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి మంగళవారం నుంచే అమలులోకి రానున్నాయి. ఈ నిబంధనను అమలు చేయడంలో ఇబ్బందులు తప్పకపోవచ్చని ప్రకటనకర్తలు,ప్రకటనల ఏజెన్సీల వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# భైరాన్ పల్లిలో బయటపడ్డ చాళుక్యుల నాటి శిల

సిద్దిపేట;సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలంలోని భైరాన్ పల్లిలో పురాతన శిల బయటపడింది. గ్రామంలోని పురాతన జైన ఆలయం ఆవరణలో గ్రామస్థులు ఈ శిలను గుర్తించారు. స్థానికంగా అంగడి వీరన్న శివాలయంగా పిలిచే ఈ ఆలయం ఆవరణలో ఇటీవలి వర్షాలకు చిన్న గుంత ఏర్పడింది. అందులో ఈ శిలను గుర్తించి బయటకు తీసినట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై పురావస్తు శాఖకు సమాచారం ఇవ్వగా.. గ్రామానికి చేరుకున్న అధికారులు ఆ శిలను పరిశీలించి అది చాళుక్యుల కాలం నాటిదని వెల్లడించారు. పురావస్తు శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ తాజాగా బయటపడ్డ ఈ శిల జైన చౌముఖి శిల్పం అని, 5 అడుగుల ఎత్తుతో చెక్కారని చెప్పారు. నలువైపులా ఉన్న శిల్పాలు 24వ జైన తీర్థంకరుడు మహా వీరుడి ధ్యానం చేస్తున్న చిత్రాలని వివరించారు. గతంలో ఈ తరహా శిల్పాలను కొలనుపాక, వేములవాడలో గుర్తించామని చెప్పారు. జైనులు వీటిని 'సర్వతోభద్ర' అంటూ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ శిల్పాలు లభించిన ప్రాంతాలు గతంలో జైనధర్మ కేంద్రాలుగా విరాజిల్లాయని వివరించారు. బౌద్ధుల తరహాలోనే జైనులు కూడా స్తూపాలు, చైత్యాలు నిర్మించుకునేవారని, గ్రామంలోని అంగడి వీరన్న శివాలయం ముందున్న శాసనాల ద్వారా తెలుస్తోందని శ్రీనివాస్ చెప్పారు.

# పార్లమెంట్ లో తగ్గిన ముస్లింల వాట

న్యూఢిల్లీ, దేశంలోని అన్నిరంగాల్లో ముస్లింల ప్రాతినిధ్యం కనిపిస్తుంద. రాజకీయాల్లోనూ రాణిస్తున్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి పోటీ చేసిన ముస్లిం అభ్యర్థులు విజయం సాధించారు. అయితే 2019తో పోలిస్తే ఈసారి ఎన్నికైన సభ్యుల సంఖ్య తగ్గింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 24 మంది ముస్లిం అభ్యర్థులు ఎంపీలుగా ఎన్నికయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈ సంఖ్య రెండు తగ్గింది. ఇక మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఎన్నికైన 24 మందిలో ఒక్కరు కూడా అధికార బీజేపీ నుంచి లేరు. ఎన్డీఏ కూటమికి చెందిన ముస్లిం ఎంపీ కూడా లేరు. ఈ 24 మందిలో 21 మంది ఇండియా కూటమికి చెందినవారే. 18వ లోక్‌సభకు ఎన్నికైన 24 మంది ఎంపీల్లో అత్యధికంగా 9 మంది కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. తర్వాత తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఐదురుగు ముస్లిం ఎంపీలు ఉన్నారు. నలుగురు ముస్లింలు సమాజ్‌వాది పార్టీకి, ఇద్దరు ఇండియన్ ముస్లిం లీగ్‌కు, ఒకరు నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందినవారు ఉన్నారు. ఏ కూటమిలో లేని ఎంఐఎం నుంచి ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఎంపీగా గెలిచారు. మరో ఇద్దరు ముస్లింలు స్వతంత్రులుగా ఎన్నికయ్యారు. 18వ లోక్‌సభలో ముస్లింల ప్రాతినిధ్యం 4.42 శతానికి తగ్గింది. 1980లో జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా 49 మంది ముస్లింలు గెలిచారు. 1984లో జరిగిన ఎన్నికల్లో 45 మంది ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ముస్లిం ఎంపీల సంఖ్య 40కి మించలేదు. 2014లో 11 ప్రధాన పార్టీలు మొత్తం 82 మందికి టికెట్ ఇవ్వగా వీరిలో 16 మంది మాత్రమే విజయం సాధించారు. 2019లో 115 మందికి 11 ప్రధాన పార్టీలు టికెట్ ఇవ్వగా, అప్పుడు 16 మంది విజయం సాధించారు.

# హుస్నాబాద్ తిరుమల గార్డెన్స్ లో ఈ నెల 24 న జాబ్ మేళా పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతా హుస్నాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర యువజన సర్వీస్ శాఖ పక్షాన ఈనెల 24న ఉదయం 10 గంటలకు సున్నా, నుండి పీజీ వరకు చదివిన వారందరికీ ఉద్యోగాలు కల్పించడానికి జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఈ జాబ్ మేళా కార్యక్రమంలో సుమారు 5000 ఉద్యోగాలు నిరుద్యోగులకు కల్పించబడతాయి. సున్నా నుండి పిజి వరకు చదువుకున్న ప్రతి ఒక్కరు యువత ఈ జాబ్ మేళాను ఉపయోగించుకోవాలి. హుస్నాబాద్ ప్రజలందరికీ కోరుతున్నా నేను యువజన విద్యార్థి నాయకునిగా వచ్చిన తర్వాత విద్యార్థి, ఉద్యోగ అవకాశాలు కు సంబంధించి, వ్యవసాయ విద్యా ఆరోగ్యానికి ప్రాధాన్యత కల్పిస్తున్నటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నుండి నిరుద్యోగ యువత తరలి రావాలి. జాబ్ మేళాలో ఉద్యోగం రాకుండా బయట దేశాల్లో విదేశీ స్కిల్స్ ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. అక్కడ మంచి జీతాలు ఉన్న ఉద్యోగాలు కూడా వస్తాయి. యువజన శాఖ తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో అందరూ పాల్గొనాలి. హుస్నాబాద్ లోని తిరుమల గార్డెన్స్ లో ఉదయం 10:00 గంటల నుండి ఈ జాబ్ మేళా కార్యక్రమం జరుగును.

# విస్తరణకు రెడీ... భారమంతా అధిష్టానంపైనే

హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉండే అవకాశాలున్నాయి. ఎప్పుడైనా మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశముందని చెబుతున్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కసరత్తులు పూర్తి చేసినట్లు తెలిసింది. ఢిల్లీ పెద్దల నుంచి మంత్రివర్గ విస్తరణకు సంబంధించి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. తెలంగాణ మంత్రివర్గంలో ఇంకా ఆరు స్థానాలు ఖాళీగానే ఉంచారు. అనేక శాఖలను పలువురు మంత్రులు చూస్తున్నారు. ఇది వారికి కొంత ఇబ్బందిగా మారింది. దీంతో పాటు కొన్ని సామాజికవర్గాలకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో ఈసారి వారికి అవకాశమివ్వాలని నిర్ణయించారని తెలిసింది. ఇటీవల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరయిన రేవంత్ ఈ మేరకు విస్తరణకు సంబంధించిన హామీని పొందినట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా దగ్గరపడుతుండటంతో రేవంత్ రెడ్డి త్వరగానే విస్తరణకు రెడీ అవుతున్నారని తెలిసింది.తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు కసరత్తు జరుగుతోంది. ఇదే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఆగస్టు 15వ తేదీలోపు పూర్తిస్థాయి మంత్రివర్గం ఉండాలని రేవంత్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిపి పన్నెండు మంది మాత్రమే కేబినెట్ లో ఉన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏర్పడిన తొలి మంత్రివర్గంలో పన్నెండు మందికే స్థానం దక్కింది. మరికొందరికి అవకాశం ఇవ్వాలని ఆలోచించినా లోక్‌సభ ఎన్నికల తర్వాత మిగిలిన స్థానాలను భర్తీ చేయాలన్న ఆలోచనలో హైకమాండ్ ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో అందరూ కలసి పనిచేసేందుకు కొన్ని ఖాళీలను కావాలని అలాగే ఉంచారు. మంత్రివర్గంపై ఎందరో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరం నుంచి గత ఎన్నికల్లో ఒక్కరూ కాంగ్రెస్ నుంచి గెలవలేదు. మొన్న కంటోన్మెంట్ లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గణేష్ విజయం సాధించారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తి కావడంతో విస్తరణ చేపట్టాలని ఆలోచిస్తున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో రెడ్డి సామాజికవర్గం నుంచి నలుగురు మంత్రులుండగా, ఎస్సీ, బీసీ సామాజికవర్గాల నుంచి ఇద్దరు, ఎస్టీ, కమ్మ, వెలమ సామాజికవర్గాల నుంచి ఒక్కొక్కరు లెక్కన కేబినెట్ లో చోటు దక్కింది. అయితే ఈసారి విస్తరణలో మైనారిటీలకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. మైనారిటీకి చెందిన వారిని ఎమ్మెల్సీగా చేసి కేబినెట్ లో చోటు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. దీంతో పాటు ముదిరాజ్ వర్గానికి చెందిన వారికి కూడా ఈసారి కేబెనెట్ లో ఛాన్స్ దక్కే అవకాశాలున్నాయి. అయితే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రి పదవి ఇచ్చే ఆలోచనలో మాత్రం కాంగ్రెస్ నాయకత్వం లేదు. అది పార్టీ క్యాడర్ లోకి తప్పుడు సంకేతాలు పంపుతుందని భావిస్తున్నారు. అందుకే పార్టీకి గత ఎన్నికల్లో పనిచేసిన వారికే కేబినెట్ లో చోట కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎవరికీ మంత్రి పదవి దక్కలేదు. ఈ జిల్లా నుంచి ఒకరికి అవకాశం ఉండనుంది. నిజామాబాద్ జిల్లా నుంచి కూడా ఈసారి కేబినెట్ లో ఒకరికి ఛాన్స్ ఉంటుందని చెబుతున్నారు. అయితే రెడ్డి సామాజికవర్గాల నుంచి కాకుండా ఇతర సామాజిక వర్గాల వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న యోచనలో రేవంత్ ఉన్నారు. పార్టీ కో?సం పనిచేసి త్యాగాలు చేసిన వారిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఎవరిని నొప్పించకుండా కేబినెట్ కూర్పు చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. అయితే కేబినెట్ విస్తరణ చేసినా రేవంత్ రెడ్డి ఆ నెపాన్ని హైకమాండ్ పైనే నెట్టే అవకాశముంది. తనకు ఏమాత్రం సంబంధం లేదని, హైకమాండ్ సూచన మేరకే తాను విస్తరణ చేశానని చెప్పే అవకాశాలు ఎక్కువ. అయితే ఎక్కువ అసంతృప్తులు చోటు చేసుకోకుండా, మంత్రి పదవి రాని వారికి తర్వాత జరిగే మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పిస్తామన్న హామీ కూడా గట్టిగా ఇవ్వాలన్న నిర్ణయంతో రేవంత్ ఉన్నట్లు తెలిసింది. మొత్తం మీద అతి త్వరలోనే రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని విస్తరించబోతున్నారన్న వార్త తెలిసిన వెంటనే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

# ఫేక్ జీవోలు...మండిపడుతున్న టీ కాంగ్రెస్...

హైదరాబాద్: నిజం చెప్పులేసుకునేలోపు.. అబద్ధం ఊరంతా చుట్టేస్తుందంటారు. ఏ మహానుభావుడు చెప్పాడో కానీ.. ఇది ముమ్మాటికి నిజమనిపిస్తుంది కొన్ని సీన్స్‌ను చూస్తే.. దీనికి లెటెస్ట్ ఎగ్జాంపుల్ యా నుంచి ఎఆకి పేరు మార్చేందుకు అయ్యే ఖర్చుకు సంబంధించిన ప్రచారం. ఒకరు 2 వేల కోట్లు అంటారు.. మరికొందరు 4 వేల కోట్లు అంటారు. ఇంతకీ ఇందులో ఏది నిజం..? ఏది అబద్ధం..?తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరగానే తీసుకున్న అతి ముఖ్యమైన నిర్ణయాల్లో.. యా నుంచి ఎఆగా పేరు మార్చడం ఒకటి.. మరి చెప్పినంత ఈజీగా జరగదు కదా పని.. గవర్నమెంట్‌లోని అన్ని డిపార్ట్‌మెంట్స్‌లో ఈ మార్పు జరగాలి.. దీనికి కాస్త ఖర్చవుతుంది.. ఇది నిజం.. బట్.. ప్రభుత్వంపై ఎప్పుడెప్పుడు బురద జల్లుదామా? అని ఎదురుచూసే విపక్షం.. దీనిని అస్త్రంగా మలుచుకుంది. ప్రజాపాలన పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారంటూ కొత్త రాగం ఎత్తుకుంది. హైలేట్ ఏంటంటే.. ఇందులో ప్రభుత్వం చేస్తున్న ఖర్చును కూడా డివైడ్ చేసింది. తెలంగాణ తల్లి విగ్రహం మార్పు కోసం 996 కోట్లు.. కార్యాలయాల పేర్ల మార్పు కోసం 461 కోట్లు.. ఇనిస్టిట్యూషన్స్ పేర్ల మార్పు కోసం 842 కోట్లు.. అడ్వర్టైజ్‌మెంట్స్ అండ్ కమ్యూనికేషన్స్ పేర్ల మార్పు కోసం 563 కోట్లు.. పోలీస్ సెక్యూరిటీస్ పేర్ల మార్పు కోసం 5 కోట్లు.. ఇలా డివైడ్ చేసి మొత్తం 4 వేల 639 కోట్లు ఓ లెక్కను కూడా ఫైనల్ చేశారు బీఆర్ఎస్ నేతలు..దీనికి ముందు మరో డాక్యుమెంట్ కూడా వైరల్ అయ్యింది. యా నుంచి ఎఆగా పేరు మార్చేందుకు 2 వేల 767 కోట్లు ఖర్చవుతాయంటూ వైరల్ అయ్యింది ఓ డాక్యుమెంట్.. అఫ్‌కోర్స్ ఇది ఫేకే.. బట్ దానిని క్రాస్ చెక్ చేసే ఓపిక నేతలకు ఎందుకు ఉంటుంది. మనకు పనికి వచ్చేదా? కాదా? అని మాత్రమే ఆలోచించారు. షేర్ చేయడం స్టార్ట్ చేశారు..నిజమేంటో తెలియదు.. తెలుసుకునే ఉద్దేశం కూడా లేదు. బట్ ప్రజల్లోకి మాత్రం బలంగా వెళ్లింది. రేవంత్ రెడ్డి అనవసరంగా ఖర్చు చేస్తున్నారని.. మరి నిజాలు తెలియకపోతే అది అనర్థాలకు దారి తీస్తుంది. ప్రభుత్వంపై ప్రజల్లో అపనమ్మకం పెరుగుతుంది. అందుకే కాంగ్రెస్ నేతలు సీన్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ముందుగా అసలు ఈ ఫేక్ డాక్యుమెంట్‌ను ఎవరు రూపొందించారు? ఎక్కడ రూపొందించారు? ఎవర్ అప్‌లోడ్ చేశారు? ఎందుకు చేశారు? ఈ విషయాలన్నింటిపై ఇప్పుడు సైబర్ పోలీసులు ఇన్వెస్టిగేషన్ స్టార్ట్ చేశారు. రేపో, మాపో వారు దొరక్కపోటు.. కటకటాల వెనక్కి వెళ్లకా పోరు.ఇప్పుడు బీఆర్ఎస్ నేతల విషయానికి వద్దాం.. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించారు. పాలనపై ఓ అవగాహన ఉంది. ప్రభుత్వం ఏ విధంగా నడుస్తుందో ఓ ఐడియా ఉంది. మరి ఇన్ని తెలిసి కూడా.. ఏ నోట్‌ను బేస్‌గా తీసుకోవాలి.. ఏ నోట్‌ను తీసుకోకూడదు అనే కామన్‌సెన్స్ లేకపోతే ఎలా? మంచి డిజైన్ చేసి.. ఖర్చుల లెక్కలు బాగా కనిపించేలా బాగానే ఎడిట్ చేశారు. మరి ఆ శ్రద్ధ.. ఇది నిజమా? కాదా? అనే దానిపై ఎందుకు పెట్టలేదు.. ? నిజంగా తెలియదా? లేక తెలిసినా మనకు వచ్చే నష్టం ఏముందిలే అనుకున్నారా?ఇప్పుడే కాదు.. గతంలో కూడా ఇలానే తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి చిక్కుల్లో పడ్డారు బీఆర్ఎస్ నేతలు.. ఓయూ ఇష్యూలో ఏకంగా తప్పుడు సర్క్యూలర్‌నే సృష్టించారు. ఈ కేసులో ఇప్పటికే బీఆర్ఎస్ నేత క్రిశాంక్ అయితే అరెస్ట్ కూడా అయ్యారు. ఇప్పుడిదే విషయాన్ని గుర్తు చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు..ఇప్పుడు చెప్పండి.. నిజం చెప్పులేసుకునేలోపు.. అబద్ధం ఊరంతా తిరిగి వచ్చిందా? లేదా? విపక్షం ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? అనే దానిపై బీఆర్ఎస్ కొంచెం గ్రౌండ్ వర్క్ చేస్తే బెటర్ అంటున్నారు కాంగ్రెస్ నేతలు.. తప్పుంటే నిలదీయాలి..? అవకతవకలు ఉంటే ప్రశ్నించాలి..? ప్రజాసంక్షేమం కోసం రాజ్యాంగం ఇచ్చిన హక్కుల పరిధిలో ఉండి పోరాడాలి? ఇందులో ఎలాంటి తప్పు లేదు. బట్.. చేసిన ప్రతి పనిలో తప్పులెతకడం.. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడం చేస్తే.. ఇలానే అవమానాల పాలవ్వాల్సి వస్తుంది. ఇప్పటికే ప్రజల్లో అంతంత మాత్రంగా ఉన్న అభిమానం కాస్త మరింత చులకనయ్యే అవకాశం ఉంది. ప్రజలు కూడా ఏ విషయాన్నైనా గుడ్డిగా నమ్మడం మంచిది కాదు..ఈ డిజిటల్ యుగంలో నిజాన్ని అబద్ధంగా.. అబద్ధాన్ని నిజంగా మార్చడం చాలా ఈజీ.. సో ఓ నిర్ణయానికి వచ్చే ముందు కాస్త దాన్ని డీప్‌గా అనలైజ్ చేయడం బెటర్.

# 4 నెలల్లో 1,770 కోట్లు లూటీ 5 నెలల్లోనే 8 లక్షల సైబర్ కేసులు!


హైదరాబాద్: దేశంలో సైబర్ నేరాలు దారుణంగా పెరిగిపోతున్నాయి. గడిచిన ఐదు నెలల్లోనే సుమారు ఎనిమిది లక్షలకు పైగా సైబర్ కేసులు నమోదయ్యాయి. గత మూడేండ్లుగా దేశంలో పౌరులు సైబర్ నేరాల బారిన పడటం పెరుగుతున్నది. సైబర్ నేరాల్లో యూపీఐ, క్రెడిట్‌కార్డు, పార్ట్‌టైమ్ జాబ్ మోసాలు అత్యధికంగా ఉన్నట్టు లోకల్ సర్కిల్స్ సర్వే నివేదికలు వెల్లడించాయి. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 43 శాతం మంది తాము, తమ కుటుంబసభ్యులు క్రెడిట్ కార్డ్ లావాదేవీల్లో మోసపోయామని, 36 శాతం మంది యూపీఐ లావాదేవీల్లో నష్టపోయామని తెలిపారు. పట్టణ ప్రజల్లో ఎక్కువశాతం పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరిట పంపిన లింక్‌లు, క్యూఆర్‌కోడ్‌లకు డబ్బులు చెల్లించి మోసపోయినట్టు సర్వే తెలిపింది.

దేశవ్యాప్తంగా 302 జిల్లాల నుంచి కొన్ని వేల మందిని సర్వే చేయగా ఈ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అన్ని పనులకూ ఆన్‌లైన్ వేదిక కావడం, అక్కడ పౌరుల డాటాను రక్షించే సరైన వ్యవస్థ లేకపోవడంతో పాన్‌కార్డ్, ఆధార్, మొబైల్ నంబర్, ఈ-మెయిల్, చిరునామా వంటి వ్యక్తిగత సమాచారం విరివిగా లభిస్తున్నది.

ఆ డాటా ఆధారంగా ఆర్థిక మోసగాళ్లు సులభంగా ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ మోసాలు రికార్డు స్థాయిలో 300 శాతం పెరిగినట్టు సర్వే తెలిపింది. మొత్తంగా గత రెండేండ్లలో సైబర్ మోసాలు 700 శాతం పెరిగాయని వెల్లడించింది.

**రోజుకు రూ.14 కోట్ల మోసాలు!**

దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ మోసాల ద్వారా నేరగాళ్లు రోజుకు సుమారు 14 కోట్ల రూపాయలను అమాయకుల నుంచి కొల్లగొడుతున్నారు. అంటే ఏడాదికి సుమారు రూ.5వేల కోట్లను వివిధ పద్ధతుల్లో దోచుకుంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం గత జనవరి నుంచి ఏప్రిల్ చివరి వరకు నాలుగు నెలల్లో రూ.1,770 కోట్లను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. గడిచిన ఐదేండ్లలో, ఈ ఏడాది ఏప్రిల్ చివరి నాటికి సుమారు 40 లక్షల సైబర్ నేరాలు నమోదయ్యాయి.



**తెలంగాణలో ఏటా రూ.1450 కోట్లు**

సైబర్ నేరాల వల్ల ఒక్క తెలంగాణలోనే రోజుకు సుమారు రూ.4కోట్ల చొప్పున.. ఏడాదికి సుమారు రూ.1,450 కోట్ల డబ్బును సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారు. ఈ ఏడాది మూడు నెలల్లో నమోదైన టాప్-5 సైబర్ నేరాల్లో బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ టాప్‌లో ఉంది. బెట్టింగ్‌లకు వ్యసనపరులైన వారిని గుర్తించి.. వారికి ఈజీ మనీని పరిచయం చేసి, అక్కడ బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపు మళ్లిస్తున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు. రూ.1000 నుంచి ఇన్వెస్ట్‌మెంట్ పెట్టించి.. రూ.లక్షలు, కోట్లలో మోసం చేస్తున్నారని చెప్తున్నారు. తర్వాతి స్థానాల్లో ఓటీపీ ఫ్రాడ్స్, అడ్వైర్టైజమెంట్ ఫ్రాడ్స్ (ఓఎల్ఎక్స్), ఫెడ్ఎక్స్ కొరియర్ సర్వీసెస్, సెక్స్‌టార్షన్ వంటివి టాప్-5 నేరాల్లో ఉన్నట్టు సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు. కాగా గతంలో విపరీతంగా పెరిగిన సెక్స్‌టార్షన్ మోసాలు.. ప్రస్తుతం తెలంగాణలో తగ్గుముఖం పట్టినట్టు వెల్లడించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురయ్యామని తెలిసిన వెంటనే (గోల్డెన్ అవర్) 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కోరుతున్నారు. ప్రతిరోజూ కొత్త తరహాలో చేస్తున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

దేశంలో గత ఐదేండ్లలో నమోదైన కేసులు

# టీ తాగడానికి వచ్చి 96 వేలు ...

మహబూబ్ నగర్: టెక్నాలజీ పెరగడం వల్ల ఎన్ని లాభాలు ఉన్నాయో.. అంతే స్థాయిలో నష్టాలు కూడా ఉన్నాయి. టెక్నాలజీని ఉపయోగించి కేటుగాళ్లు ఎన్నో మోసాలకు తెగబడుతున్నారు. తాజాగా హోటల్‌లో టీ తాగేందుకు వచ్చిన వ్యక్తి..ఏకంగా ఆ హోటల్ నిర్వాహకుడి ఫోన్ నుంచే 96వేల రూపాయలు కొట్టేశాడు. సిద్దిపేట జిల్లాలో చోటు చేసు కున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. విషయం తెలుసుకున్న ఆ హోటల్ యజమానితో పాటు, గ్రామస్తులు షాక్ అయ్యారు. వివరాల్లోకి వెళ్తే?అక్కన్నపేట మండల కేంద్రంలోని హోటల్ లో టీ తాగేందుకు వచ్చిన ఓ వ్యక్తి, డబ్బులు చెల్లించే నెపంతో అతని నుంచే తస్కరించాడు. ఏకంగా ఆ హోటల్ నిర్వాహకుడి ఫోన్ నుండి గూగుల్ పే ద్వారా రూ.96వేలు చోరీ చేశాడు. రాజస్థాన్‌కు చెందిన నారాయణ అనే వ్యక్తి గత ఐదేళ్లుగా అక్కన్నపేట మండల కేంద్రంలో హోటల్ నిర్వహిస్తున్నాడు. ఆయన హోటల్‌కు చత్తీస్ ఘడ్‌కు చెందిన ఓ వ్యక్తి టీ తాగేందుకు వచ్చాడు.టీ తాగిన తర్వాత తన వద్ద డబ్బులు లేవని తన మిత్రుడు గూగుల్ పే ద్వారా డబ్బు పంపిస్తాడని చెప్పి ఫోన్‌చేసి నంబర్ చెప్పాలని హోటల్ నిర్వాహకుడు నారాయణను కోరాడు. దీంతో ఆ హోటల్ నిర్వాహకుడు ఆ వ్యక్తి చెప్పిన నంబర్‌కు ఫోన్ చేయడంతో 500 రూపాయలు అవతలి వ్యక్తి గూగుల్ పే చేశాడు. అనంతరం సదరు వ్యక్తి హోటల్ నిర్వాహకుడిని ఒకసారి ఫోన్ ఇవ్వాలని, తనస్నేహితుడికి ఫోన్ చేసి మాట్లాడుతానని తీసుకుని నారాయణ గూగుల్ పే నుండి రూ.96వేలు తన స్నేహితుడి ఫోన్‌నంబర్‌కు పంపించాడు. పనిలో పడిన హోటల్ నిర్వాహకుడు నారాయణ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఆ తర్వాత చూసే సరికి తన అకౌంట్‌లో డబ్బులు ఖాళీ అవ్వడంతో షాక్ అయ్యాడు.తాను మోసపోయినట్లు గుర్తించి వెంటనే అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు హోటల్ నిర్వాహకుడు నారాయణ.కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేపట్టారు.

# నారాయణ్ సేవా సంస్థాన్ సేవా నిరతి ప్రశంశనీయం

**కొనియాడిన లోక్‌సభ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

**సేవా సంస్థాన్ శిబిరంలో 600 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందజేత**

హైదరాబాద్ ;హైదరాబాద్‌లోని కింగ్ కోటిలోని ఈడెన్ గార్డెన్‌లో నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నారాయణ్ లింబ్ అండ్ కాలిపర్స్ ఫిట్‌మెంట్ క్యాంపు ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో తెలంగాణకు చెందిన 600 మందికి పైగా వికలాంగులకు 800 ఎగువ మరియు దిగువ అవయవాలు మరియు కాలిపర్‌లను అమర్చడం ద్వారా వారి జీవన నాణ్యతను గణనీయంగా మెరుగుపరచడం ద్వారా సహాయం అందించబడింది. లబ్దిదారులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆనందం మరియు కృతజ్ఞతలు లోతుగా కదిలాయి.ఈ శిబిరాన్ని లోక్‌సభ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సామాజిక కార్యకర్తలు మాధవి లత, గౌరీశంకర్, కమల్ నారాయణ్ రాఠి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు దాతలు, వికలాంగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా రాజస్థాన్‌కు చెందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని వికలాంగులకు సహాయం చేసేందుకు సంస్థాన్ అంకితభావంతో ఉన్నారని కొనియాడారు. ప్రత్యేక అతిథి మాధవి లత సంస్థాన్ ప్రెసిడెంట్ ప్రశాంత్ అగర్వాల్ మరియు డైరెక్టర్లు వందనా అగర్వాల్ మరియు పాలక్ అగర్వాల్ వారి గొప్ప ప్రయత్నాలకు కృతజ్ఞతలు తెలియజేశారు మరియు వారికి తన మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. శిబిరానికి ఎంపీపీ అనిల్‌కుమార్ యాదవ్ అధ్యక్షత వహించి లబ్ధిదారుల ఆనందాన్ని చూసి హర్షం వ్యక్తం చేశారు.సంస్థాన్ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్ ఎంపీలు రెడ్డి మరియు యాదవ్, సామాజిక కార్యకర్త మాధవి లత మరియు అతిథులు మల్లికార్జున్ రావు, జస్మత్ భాయ్, అల్కా చౌదరి, ఉత్తమ్ దమ్రానీ మరియు రీదీష్ జాగీర్దార్‌లతో సహా ప్రముఖులకు సాంప్రదాయ మేవారీ ఫ్యాషన్‌లో స్వాగతం పలికారు. అతను సంస్థాన్ యొక్క 39 సంవత్సరాల సేవ యొక్క అవలోకనాన్ని అందించాడు మరియు తరువాతి ఐదు సంవత్సరాల కోసం దాని దృష్టిని వివరించాడు. ఫిబ్రవరి 4వ తేదీ క్యాంపు తర్వాత హైదరాబాద్‌లో రెండోసారి నిర్వహిస్తున్న ఈ శిబిరం వారి స్వగ్రామానికి సమీపంలో ఉన్న వికలాంగులకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.ప్రమాదాల కారణంగా 600 మందికి పైగా వ్యక్తులు నారాయణ్ లింబ్స్ సహాయంతో తిరిగి నడిచారని అగర్వాల్ నివేదించారు. శిబిరంలో 400 దిగువ అవయవాలు, 50 ఎగువ అవయవాలు, 55 బహుళ అవయవాలు మరియు 45 కాలిపర్‌లను అమర్చారు. సంస్థాన్ నుండి 80 మంది సభ్యుల బృందం సేవలను అందించింది, వారికి 60 మంది వాలంటీర్లు వారి సహకారానికి సర్టిఫికెట్లు అందించారు. అదనంగా, హైదరాబాద్ ఆశ్రమం నుండి కంప్యూటర్ నైపుణ్యాలు, కుట్టు మరియు కళ మరియు క్రాఫ్ట్‌లలో శిక్షణ పొందిన 85 మంది పేద మరియు వికలాంగులకు సర్టిఫికేట్‌లను కూడా ప్రదానం చేశారు.క్యాంపు కోఆర్డినేటర్లు అచల్ సింగ్ భాటి, రోహిత్ తివారీ అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఐశ్వర్య త్రివేది నిర్వహించారు.

# ఇక పుస్తకాలతో కుస్తీ...

హైదరాబాద్: వేసవి సెలవులు తర్వాత తెలంగాణలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 60 లక్షల మంది విద్యార్థులున్నారు. పాఠశాలలకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేశారు. ముఖ్యంగా తరగతి గదులను సర్వాంగ సుందరంగా అలంకరించారు.తొలిరోజు విద్యార్థులకు పుస్తకాలు, నోటు బుక్స్, యూనిఫామ్‌లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కొన్ని స్కూల్స్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు వాటిని విద్యార్థులకు ఇవ్వనున్నారు. అయితే ఈనెల 6 నుంచి బడిబాట కార్యక్రమం మొదలైంది. 19 వరకు జరగనుంది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించనున్నారు.ఇక స్కూళ్ల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ఎస్‌హెచ్జీ గ్రూపుల సభ్యులు, టీచర్లు, ఇతర ఉన్నతాధికారులుంటారు. స్కూల్స్ పరిధిలో చేపట్టే ప్రతీ పనిని ఈ కమిటీల ద్వారా నిర్వహిస్తారు. ఈ ఏడాదిలో ఇప్పటికే సుమారు 600 కోట్ల రూపాయలతో మరమ్మతులు పూర్తి చేశారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విద్యాశాఖ ప్రకటించింది. దీనికి ప్రకారం మొత్తం 229 పనిదినాలు ఉండనున్నాయి. ఏప్రిల్ 24 వరకు పాఠశాలలు కొనసాగుతాయి. అక్టోబర్ 13 నుంచి 25 వరకు అంటే దాదాపు 13 రోజులు దసరా సెలవులు ఉంటాయి. డిసెంబర్ 23 నుంచి 27 క్రిస్మస్, వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 17 వరకు ఆరురోజుల పాటు సంక్రాంతి సెలవులుంటాయి. వచ్చే ఏడాది జనవరి మొదటి వారానికి పదో తరగతి సిలబస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే విద్యార్థులకు ప్రతీ రోజూ ఐదు నిమిషాలపాటు యోగా, మెడిటేషన్ క్లాసులు నిర్వహించనున్నారు.

**గురు కులాలు క్లోజేనా...**

తెలంగాణ రాష్ట్రం వచ్చాక.. అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ పార్టీ.. విద్యార్థుల చదువు కోసం ప్రత్యేకంగా గురుకులాలు ఏర్పాటు చేసింది. కులాలు, మతాల ప్రాతిపదికన వీటిని ఏర్పాటు చేసింది. బీసీ, ఎస్సీ, మైనారిటీ గురుకులాల పేరుతో సుమారు వెయ్యికిపైగా గురుకులాలు ఏర్పాటు చేశారు. ఉచిత విద్యా, భోజనంతోపాటు వసతి కూడా కల్పిస్తుండడంతో గురుకులాలకు ఆదరణ పెరిగింది. అడ్మిషన్లకు పోటీ పడుతున్నారు విద్యార్థులు. ప్రవేశ పరీక్ష ద్వారా ప్రభుత్వం అడ్మిషన్లు కల్పిస్తోంది.ఇక గురుకులాల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితంగా విద్య అందుతోంది. ఆరో తరగతిలో చేరిన విద్యార్థులు ఉచితంగా ఇంటర్ వరకు చదివే అవకాశం ఉంది. పుస్తకాలు, యూనిఫాంలు, భోజనంతోపాటు ఉదయం టిఫిన్స్, సాయంత్రం స్నాక్స్ ఇలా రుచికమైన భోజనం కూడా పెడుతున్నారు. ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చాక పిల్లలు ఫోన్లకు ఎడిక్ట్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలను గురుకులాల్లో చేర్పిస్తున్నారు. బాలికలు, బాలురకు కూడా వేర్వేరుగా హాస్టల్స్ ఉండడం, నిపుణులైన ఉపాధ్యాయులు ఉండంతో గురుకులాల విద్యార్థులు ఫలితాల్లోనూ సత్తా చాటుతున్నారు. రెండు రోజుల క్రితం గురుకులాలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పిల్లలను గురుకులాల్లో చేర్పించడం వలన పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య ఉన్న సంబంధాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఈమేరకు ఇటీవల ఓ నివేదిక అందిందని వెల్లడించారు. తద్వారా పిల్లలను చిన్నప్పుడే గురుకులాల్లో చేర్పించడం మంచిది కాదు అని పేర్కొన్నారు. దీంతో రేవంత్ సర్కార్ గురుకులాలను మూసివేస్తుందా అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కొందరు ఎత్తివేయకపోవచ్చు కాని, ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించకుండా 8వ తరగతిలో కల్పిస్తారని కొందరు పేర్కొంటున్నారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నెటిజన్లు స్పందిస్తున్నారు. పేదలకు వరంగా ఉన్న గురుకులాలను ఎత్తివేయొద్దని కోరుతన్నారు. కేసీఆర్ మీద కోపంతో పిల్లల భవిష్యత్‌తో ఆడుకోవద్దని కొందరు సూచిస్తున్నారు. గురుకులాలు ఎత్తేయాలని ఆలోచన చేస్తున్నారా అని చాలా మంది ప్రశ్నించారు.

# పంతుళ్ల సొమ్ముతో పాఠశాలల నిర్వహణ

వరంగల్: రాష్ట్రంలో విద్యారంగం కునారిల్లుతున్నది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను సర్కారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వరంగల్, ఖిలావరంగల్ మండలాల్లో 26 ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలకు ప్రభుత్వం సక్రమంగా కిరాయి చెల్లించడం లేదు. వరంగల్ మండలంలో 4, ఖిలావరంగల్ మండలంలో 6 పాఠశాలల భవనాలకు రూ.21 లక్షలకుపైగా అద్దెను పెండింగ్‌లో పెట్టడంతో వాటిని ఖాళీ చేయాలని విద్యాశాఖ అధికారులపై యజమానులు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలలను సమీపంలోని ఇతర భవనాల్లోకి తరలించి, ఉపాధ్యాయులు తమ సొంత సొమ్ముతో అద్దె చెల్లించాల్సి వస్తున్నది. వరంగల్ ఎల్బీనగర్ లోతుకుంటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతున్నది. అది కూడా ఒకే ఒక ఇరుకు గదిలో. ఆ గదిని ఉపాధ్యాయులు ఉపయోగించుకుంటూ విద్యార్థులకు వరండాలో పాఠాలు బోధిస్తున్నారు. అదే గదిపైన కార్మికులు మధ్యాహ్న భోజనం వండి విద్యార్థులకు పెడుతున్నారు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు ప్రతి నెలా రూ.1,000 చొప్పున తమ సొంత సొమ్మును అద్దెగా చెల్లిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆ గది అద్దెను రూ.2 వేలకు పెంచాలని యజమాని డిమాండ్ చేస్తుండడంతో ఉపాధ్యాయులకు ఏమీ పాలుపోవడం లేదు. నిరుడు ఈ పాఠశాలలో 17 విద్యార్థులుండగా.. ఈ ఏడాది వారి సంఖ్య 12కు పడిపోయింది. ప్రస్తుతం వారు కూడా స్కూలుకు రావడం లేదు. వరంగల్ ఎల్బీనగర్ ఎంజే రోడ్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి మరీ దయనీయంగా ఉన్నది. 1952లో ఏర్పాటైన ఈ స్కూలుకు ఇప్పటికీ సొంత భవనం లేదు. ఆరంభంలో కొన్నేండ్లపాటు మండీబజార్‌లోని ఓ అద్దె భవనంలో కొనసాగిన ఈ పాఠశాల.. ఆ తర్వాత దేశాయిపేటలోని మరో అద్దె భవనంలోకి మారింది. ఇటీవల ఆ భవనాన్ని కూడా ఖాళీ చేసి సమీపంలోని ఇంటిలో రెండు చిన్న గదులను అద్దెకు తీసుకున్నారు. వాటిలో పాఠశాలను నడిపేందుకు ఆ ఉపాధ్యాయులే ప్రతి నెలా రూ.5 వేల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అక్కడ నిరుపయోగంగా ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీ హాలును పాఠశాల నిర్వహణకు కేటాయించాలని ఉపాధ్యాయులు, స్థానికుల నుంచి వస్తున్న వినతులను అధికారులు పట్టించుకోవడం లేదు.

# ఉప్పల్‌లో ఒక్కటే టీ20.. సొంతగడ్డపై టీమిండియా 2024-25 షెడ్యూల్..!

పొట్టి ప్రపంచకప్ ట్రోఫీలో అదరగొడుతున్న టీమిండియా త్వరలోనే సొంతగడ్డపై వరుసపెట్టి మ్యాచ్‌లు ఆడనుంది. భారత జట్టు స్వదేశంలో 2024-25 సీజన్‌లో భాగంగా ఆడనున్న అంతర్జాతీయ మ్యాచ్‌ల షెడ్యూల్ వచ్చేసింది. టీమిండియా ఏ జట్టుతో ఎన్ని మ్యాచ్‌లు ఆడుతుంది? అనే వివరాలను గురువారం భారత క్రికెట్ బోర్డు వెల్లడించింది. సెప్టెంబర్ 19 వ తేదీతో సీజన్ ఆరంభం కానుందని బీసీసీఐ ప్రకటనలో తెలిపింది. సీజన్ తొలి ఫైట్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా టెస్టు సిరీస్ ఆడనుంది. అనంతరం ఇరుజట్ల మధ్య మూడు టీ20ల సిరీస్ జరుగనుంది. అక్టోబర్ 12న జరిగే భారత్, బంగ్లా ఆఖరి పొట్టి పోరుకు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదిక కానుంది. ఆ తర్వాత న్యూజిలాండ్ జట్టు భారత పర్యటనకు రానుంది. అక్టోబర్ 16 నుంచి నవంబర్ 15 వరకూ జరిగే మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో కివీస్ తలపడనుంది. ఇవి ముగియగానే.. ఇంగ్లండ్ జట్టు టీ20, వన్డే సిరీస్ కోసం భారత్‌లో అడుగుపెట్టనుంది. 2025 జనవరి 22 నుంచి ఫిబ్రవరి 12 వరకూ జరిగే ఈ రెండు ఫార్మాట్ల సిరీస్‌లో టీమిండియాకు ఇంగ్లీష్ జట్టు సవాల్ విసరనుంది.

బంగ్లాదేశ్ సిరీస్ : తొలి టెస్టు చెన్నై వేదికగా సెప్టెంబర్ 19 నుంచి 24.

రెండో టెస్టు సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 1.

టీ20 సిరీస్‌లో మొదటి మ్యాచ్ ధర్మశాలలో అక్టోబర్ 6.

రెండో మ్యాచ్ అక్టోబర్ 9న ఢిల్లీలో.



మూడో టీ20 అక్టోబర్ 12న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో.

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్.. బెంగళూరు వేదికగా తొలి టెస్టు అక్టోబర్ 16 నుంచి అక్టోబర్ 20 వరకూ.

పుణే వేదికగా అక్టోబర్ 24 నుంచి 28వ తేదీ వరకూ.

మూడో టెస్టు నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకూ ముంబైలో.

ఇంగ్లండ్‌తో వన్డే, టీ20 సిరీస్.. 2025 జనవరి 22న చెన్నైలో తొలి టీ20.

కోల్‌కతా వేదికగా జనవరి 25న రెండో టీ20. జనవరి 28న రాజ్‌కోట్‌లో మూడో టీ20. జనవరి 31న పుణేలో, ఫిబ్రవరి 2న ముంబై వేదికగా నాలుగో, ఐదో టీ20 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అనంతరం ఫిబ్రవరి 6న నాగ్‌పూర్ మ్యాచ్‌తో వన్డే సిరీస్ షురూ కానుంది. కటక్ వేదికగా ఫిబ్రవరి 9న రెండో వన్డే, అక్టోబర్ 12న అహ్మదాబాద్ వేదికగా మూడో వన్డే జరుగనున్నాయి.

# ఆ ఒక్కటి మార్చుకోవద్దు..: బుమ్రాకు విండీస్ స్టార్ కీలక సూచన

ఇంటర్నెట్ డెస్క్: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా టీ20 ప్రపంచ కప్‌లో అదరగొట్టేస్తున్నాడు. ఐపీఎల్ ఫామ్‌ను కొనసాగిస్తూ వికెట్లు తీస్తున్నాడు.

భారత విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న బుమ్రాపై విండీస్ క్రికెట్ దిగ్గజం కర్ట్‌లీ ఆంబ్రోస్ ప్రశంసలు కురిపించాడు. తాను అతడికి పెద్ద అభిమానిని అంటూనే.. బుమ్రాకు కీలక సూచనలు చేశాడు. ఇతర పేసర్లతో పోలిస్తే ఈ భారత బౌలర్‌కు విభిన్నమైన శైలి ఉండటం కలిసొచ్చే అంశమని వ్యాఖ్యానించాడు.

"జస్‌ప్రీత్ బుమ్రా గురించి చెప్పే ముందు.. నేను అతడికి పెద్ద అభిమానిని అని గర్వంగా చెబుతా. అతడిని తొలిసారి చూసినప్పటి నుంచి ఇదే భావన. అసాధారణమైన విలక్షణ బౌలర్. అత్యంత ప్రభావం చూపించగల క్రికెటర్. మామూలుగా ఫాస్ట్ బౌలర్లతో పోలిస్తే బుమ్రా విభిన్నంగా ఉంటాడు. అన్నిఫార్మాట్లలో భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. కొన్నేళ్ల కిందట ఆంటిగ్వా వేదికగా జరిగిన మ్యాచ్ సందర్భంగా బుమ్రాను కలిశా. అతడి బౌలింగ్ చూడటాన్ని ఆస్వాదిస్తా. నాకున్న అనుభవం ప్రకారం.. ఏ ఇద్దరు పేసర్లు ఒకేలాంటి శైలిలో బౌలింగ్ చేయలేరు. కొన్ని పోలికలు మాత్రం ఉంటాయి. కానీ, బుమ్రా బౌలింగ్‌ను ఎవరూ అందుకోలేరు. అందుకే, గాయాల బారిన పడనంత వరకూ బుమ్రా తన బౌలింగ్ శైలిని అస్సలు మార్చుకోకూడదు. ఇప్పుడున్న దాని వల్ల అధికంగా ఒత్తిడి పడుతుందని నేను అనుకోవడం లేదు. అయితే, నేనేమీ మెడికల్ ఎక్స్‌పర్ట్‌ను కాదు. బిషప్‌ను తీసుకుంటే.. అతడిది పర్‌ఫెక్ట్ బౌలింగ్ యాక్షనే.



కానీ, చాలాసార్లు గాయపడ్డాడు" అని ఆంబ్రోస్ తెలిపాడు.

సెమీఫైనలిస్టులు వీరే..: డేల్ స్టెయిన్

దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ టీ20 ప్రపంచ కప్‌లో సెమీస్‌కు చేరే నాలుగు జట్లపై తన అంచనాను వెల్లడించాడు. సూపర్-8లో విండీస్‌ను చిత్తు చేసిన డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లాండ్‌ను పక్కన పెట్టడం గమనార్హం. స్టెయిన్‌తోపాటు షాన్ పొలాక్, డానీ మోరిసన్ కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

స్టెయిన్: దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, వెస్టిండీస్, భారత్

పొలాక్: భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్

మోరిసన్: భారత్, ఆస్ట్రేలియా, విండీస్, ఇంగ్లాండ్

# సమరోత్సాహంతో టీమిండియా

నేడు అఫ్గాన్‌తో సూపర్-8 తొలి పోరు

బార్బడోస్: టి20 ప్రపంచకప్ సూపర్8లో భాగంగా గురువారం అఫ్గానిస్థాన్‌తో జరిగే గ్రూప్1 మ్యాచ్‌కు టీమిండియా సమరోత్సాహంతో సిద్ధమైంది. లీగ్ దశలో అజేయంగా నిలిచిన భారత్ సూపర్ సిక్స్‌లోనూ సత్తా చాటాలనే పట్టుదలతో ఉంది. ఇక అఫ్గానిస్థాన్ కూడా లీగ్ దశలో మూడు మ్యాచుల్లో గెలిచి సూపర్8కు అర్హత సాధించింది. అయితే భారత్ వంటి బలమైన జట్టును ఎదుర్కొవడం అఫ్గాన్‌కు సవాల్ వంటిదేనని చెప్పాలి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రోహిత్ శర్మ సేన బలోపేతంగా కనిపిస్తోంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు జట్టులో కొదవలేదు.




అయితే లీగ్ దశలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఆశించిన స్థాయిలో రాణించలేక పోయాడు. వరుసగా రెండు మ్యాచుల్లో ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఇలాంటి స్థితిలో ఈ మ్యాచ్‌లో అతను ఎలా ఆడతాడనేది అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈసారి కూడా కెప్టెన్ రోహిత్‌తో కలిసి విరాట్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. రోహిత్, కోహ్లిలు శుభారంభం అందిస్తే తర్వాత వచ్చే బ్యాటర్లు ధాటిగా ఆడేందుకు వీలుంటుంది. ఈ స్థితిలో ఇటు రోహిత్ అటు కోహ్లిలు ఈ మ్యాచ్‌లో జట్టుకు చాలా కీలకంగా మారారు. వికెట్ కీపర్ రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబె, హార్దిక్ పాండ్య, జడేజాలు కూడా తమ తమ బ్యాట్‌లకు పనిచెప్పక తప్పదు. కీలకమైన ఈ మ్యాచ్‌లో ప్రతి ఒక్కరూ తమవంతు పాత్రను సమర్థంగా పోషించక తప్పదు. సూర్యకుమార్, రిషబ్ పంత్‌లపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. దూకుడైన బ్యాటింగ్‌కు మరో పేరుగా చెప్పుకునే వీరిద్దరూ తమ మార్క్ షాట్లతో చెలరేగితే ప్రత్యర్థి జట్టు బౌలర్లకు కష్టాలు ఖాయం. సూర్యకుమార్ ఫామ్‌లోకి రావడం టీమిండియాకు అతి పెద్ద ఊరటగా చెప్పాలి. టి20 ఫార్మాట్‌లో కళ్లు చెదిరే రికార్డును కలిగిన సూర్య ఈసారి కూడా జట్టుకు చాలా కీలకమని చెప్పాలి. రిషబ్, దూబె, హార్దిక్, జడేజాలు కూడా తమవంతు సహకారం అందించాల్సి ఉంటుంది. దూబె, హార్దిక్, జడేజా, అక్షర్ వంటి ఆల్‌రౌండర్లు ఉండడం భారత్‌కు సానుకూల అంశంగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. బౌలింగ్‌లో కూడా టీమిండియా సమతూకంగా కనిపిస్తోంది. అర్ష్‌దీప్ సింగ్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్, చాహల్, జడేజా, హార్దిక్ వంటి మ్యాచ్ విన్నర్ బౌలర్లు జట్టులో ఉన్నారు. దీంతో ఈ మ్యాచ్‌లో భారత్‌కే గెలుపు అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి.

తక్కువ అంచనా వేయలేం.. మరోవైపు అఫ్గానిస్థాన్‌ను కూడా తక్కువ అంచనా వేసే పరిస్థితి లేదు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఆ జట్టు సమతూకంగా కనిపిస్తోంది. రహ్మనుల్లా, ఇబ్రహీం, నైబ్, అజ్మతుల్లా, మహ్మద్ నబి, నజీబుల్లా, కెప్టెన్ రషీద్, ఫరూఖి, నవీనుల్ హక్ తదితరులతో అఫ్గాన్ పటిష్టంగా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే క్రికెటర్లకు జట్టులో కొదవలేదు. దీంతో భారత్‌కు గట్టి పోటీ ఎదురైనా ఆశ్చర్యం లేదు.

# గిల్‌క్రిస్ట్‌ను అధిగమించిన డికాక్

టీ20 వరల్డ్‌కప్ 2024లో భాగంగా యూఎస్‌ఏతో నిన్న (జూన్ 19) జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో సౌతాఫ్రికా వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్ క్వింటన్ డికాక్ మెరుపు అర్ధశతకంతో (40 బంతుల్లో 74బీ 7 ఫోర్లు, 5 సిక్సర్లు) విరుచుకుపడిన విషయం తెలిసిందే.

ఈ హాఫ్ సెంచరీతో డికాక్ ఐసీసీ టోర్నీల్లో అత్యధిక పరుగులు సాధించిన వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్ల జాబితాలో రెండో స్థానానికి ఎగబాకాడు. ఈ క్రమంలో అతను దిగ్గజ వికెట్‌కీపర్, బ్యాటర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్‌ను అధిగమించాడు. ఐసీసీ టోర్నీల్లో అత్యధిక పరుగులు సాధించిన వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్ల జాబితాలో శ్రీలంక ఆల్‌టైమ్ గ్రేట్ కుమార సంగక్కర అగ్రస్థానంలో ఉన్నాడు.



ఐసీసీ టోర్నీల్లో అత్యధిక పరుగులు సాధించిన వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్లు వీరే..

కుమార సంగక్కర (84 ఇన్నింగ్స్‌ల్లో 2855 పరుగులు)

క్వింటన్ డికాక్ (53 ఇన్నింగ్స్‌ల్లో 1685 పరుగులు)

ఆడమ్ గిల్‌క్రిస్ట్ (50 ఇన్నింగ్స్‌ల్లో 1636 పరుగులు)

జోస్ బట్లర్ (56 ఇన్నింగ్స్‌ల్లో 1550 పరుగులు)

ముష్ఫికర్ రహీం (61 ఇన్నింగ్స్‌ల్లో 1500 పరుగులు)

కాగా, యూఎస్‌ఏతో నిన్న జరిగిన తొలి సూపర్-8 మ్యాచ్‌లో సౌతాఫ్రికా 18 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా.. డికాక్ (74), మార్క్రమ్ (46), క్లాసెన్ (36 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (20 నాటౌట్) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది.

అనంతరం 195 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలో?కి దిగిన యూఎస్ఏ.. నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ ఆండ్రియస్ గౌస్ (80 నాటౌట్), హర్మీత్ సింగ్ (38) యూఎస్‌ఏను గెలిపించేందుకు విఫలయత్నం చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో కగిసో రబాడ (4-0-18-3) అద్భుతంగా బౌలింగ్ చేసి యూఎస్‌ఏను కట్టడి చేశాడు.

# సిరాజ్ స్థానంలో కుల్దీప్.. చాహల్ పరిస్థితేంటి..?

టీ20 వరల్డ్ కప్ లీగ్ దశలో దుమ్మురేపిన భారత జట్టు కు కరీబియన్ గడ్డపై తొలి సవాల్ ఎదురవ్వనుంది. న్యూజిలాండ్‌కు షాకిచ్చిన అఫ్గనిస్థాన్‌తో సూపర్ 8 ఫైట్‌కు రోహిత్ శర్మ బృందం సిద్ధమైంది.

ఇప్పటివరకూ ఒకే జట్టుతో ఆడుతున్న భారత్.. ఈ మ్యాచ్‌లో మార్పులు చేసే అవకాశం లేకపోలేదు. బార్బడోస్ పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండడమే అందుకు కారణం. దాంతో, బెంచ్‌కే పరిమితమవుతున్న చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ లేదా యజ్వేంద్ర చాహల్‌ను ఆడించాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ స్పిన్నర్ పీయూష్ చావ్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

'అఫ్గనిస్థాన్‌తో తొలి ఫైట్‌లో టీమిండియాకు స్పెషలిస్ట్ స్పిన్నర్ కావాలి. స్లో పిచ్‌లపై అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాలతో పాటు కుల్దీప్‌ను ఆడించాలి. ఫామ్‌లో ఉన్న హార్దిక్ పాండ్యా మూడో సీమర్‌గా జట్టులో ఉంటాడు. అయితే.. సిరాజ్, అర్ష్‌దీప్‌లలో ఎవరో ఒకరు బెంచ్ మీదకు వెళ్లొచ్చు. కానీ, లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌పై అర్ష్‌దీప్ ఫామ్ దృష్ట్యా సిరాజ్‌ను తప్పిస్తారని అనుకుంటున్నా' అని చావ్లా వెల్లడించాడు. అదే జరిగితే.. టీ20ల్లో మెరుగైన రికార్డు ఉన్న చాహల్ పరిస్థితి ఏంటీ? అని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు.

హ్యాట్రిక్ విజయాలతో..

వరల్డ్ కప్‌లో గ్రూప్ ఏ లోని టీమిండియా అజేయంగా సూపర్ 8కు దూసుకొచ్చింది. మరోవైపు అఫ్గనిస్థాన్ సైతం హ్యాట్రిక్ విజయాలతో రెండో దశలో అడుగుపెట్టింది. కానీ, చివరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య వెస్టిండీస్




దెబ్బకు రషీద్ ఖాన్ సేన కుదేలైంది. ఏకంగా 104 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. అయితే.. సూపర్ 8లో అఫ్గన్ జట్టును తేలికగా తీసుకోవడానికి లేదు.

ఎందుకంటే.. ఆ జట్టు ప్రధాన పేసర్ ఫజల్ హక్ ఫారూఖీ అత్యధిక వికెట్ల వీరుడిగా కొనసాగుతున్నాడు. స్పిన్ త్రయం రషీద్, నూర్ అహ్మద్, మహ్మద్ నబీలు ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తున్నారు. అందుకని బార్బడోస్ పిచ్‌పై అఫ్గన్ బ్యాటర్లకు ముకుతాడు వేయాలంటే రోహిత్ స్పిన్నర్లపై ఆధారపడక తప్పదు. కాబట్టి.. కుల్దీప్ లేదా చాహల్‌కు తుది జట్టులో చోటివ్వాలని మాజీ క్రికెటర్లంతా ముక్తకంఠంతో అంటున్నారు.

# లండన్ 'టవర్ బ్రిడ్జి'పై టెన్నిస్ దిగ్గజం..

ప్రపంచ టెన్నిస్‌ను రెండు దశాబ్దాల పాటు ఏలిన రోజర్ ఫెదరర్ ఆటే కాదు జీవితమూ స్ఫూర్తిదాయకమే. తన సొగసైన ఆటతో దిగ్గజంగా పేరొందిన ఫెదరర్ మళ్లీ అభిమానుల ముందుకు వచ్చాడు. ఈసారి అతడు కోర్టులో రాకెట్ పట్టుకొని రాలేదు. తన కెరీర్‌లోని చివరి 12 రోజులు ఎలా గడిచాయో చెప్పడానికి వచ్చేశాడు.

అవును.. రెండేండ్ల క్రితం ఆటకు వీడ్కోలు పలికిన ఫెదరర్‌పై అమెజాన్ ప్రైమ్ రూపొందించిన 'ఫెదరర్ ట్వల్ ఫైనల్ డేస్' డాక్యుమెంటరీ విడుదలైంది. ఈ సందర్భంగా లండన్ టవర్ బ్రిడ్జి పై ఈ లెజెండరీ ఆటగాడి డాక్యుమెంటరీని ఆవిష్కరించారు. ఫెదరర్ జీవితంలోని అద్భుత క్షణాలను డిస్‌ప్లేపై ప్రదర్శించారు. విద్యుత్ కాంతుల వెలుగులో ఫెదరర్ విజయ ప్రస్థానాన్ని చూసిన అభిమానులు సంతోషం పట్టలేకపోయారు.

తన డాక్యుమెంటరీ ప్రమోషన్‌లో భాగంగా ఫెదరర్ ఈమధ్య పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఒక ఆటగాడి తన కెరీర్‌కు వీడ్కోలు పలకడం అనేది ఓరకంగా అంతిమ యాత్ర లాంటిది. అదొక గొప్ప ఫీలింగ్. మీరు పూర్తిగా స్పృహతోనే ఉంటారు. కానీ, అప్పుడు జరుగుతన్నవన్నీ స్లో మోషన్‌లో మసకగా మసకగా అనిపిస్తాయి' అని ఫెదరర్ అన్నాడు.

గ్రాస్ కోర్టు కింగ్



స్విట్జర్‌లాండ్‌కు చెందిన ఫెదరర్ టెన్నిస్‌పై చెరగని ముద్ర వేశాడు. 'గ్రాస్ కోర్టు కింగ్'గా ఓ వెలుగు వెలిగాడు. అయితే.. రఫెల్ నాదల్, నొవాక్ జకోవిచ్, ఆండీ ముర్రేలు ఎంట్రీ ఇవ్వడంతో ఫెదరర్ ఏకఛక్రాధిపత్యానికి చెక్ పడింది. చివరకు 2022లో లావెర్ కప్ అనంతరం కన్నీటిపర్యంతమవుతూ తనకెంతో ఇష్టమైన ఆటకు ఫెదరర్ రిటైర్మెంట్ ప్రకటించాడు. అక్కడితో టెన్నిస్‌లో ఓ శకం ముగిసిపోయింది. కెరీర్‌లో 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు కొల్లగొట్టిన ఫెదరర్ అత్యధిక ట్రోఫీ వీరుల జాబితాలో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్(24), రఫెల్ నాదల్(22)లు ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నారు.

# అఫ్గాన్‌తో సూపర్ 8 మ్యాచ్.. గేమ్ ఛేంజర్ ఇన్..

టి20 ప్రపంచకప్ 2024 లో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. సూపర్ 8లో భాగంగా మరికాసేపట్లో గ్రూప్ '1'లో జరిగే మ్యాచ్ లో అఫ్గానిస్తాన్ తో భారత్ తలపడనుంది. ఇక ఈ మ్యాచ్ లో నెగ్గి సెమీస్ కు చేరాలనే పట్టుదల మీద ఇరు జట్లు కూడా ఉన్నాయి. టాస్ నెగ్గిన రోహిత్ శర్మ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. రెండో బ్యాటింగ్ సమయంలో పిచ్ మరింత స్లోగా మారే అవకాశం ఉందనే ఉద్దేశంతో తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నట్లు రోహిత్ తెలిపాడు. ఇక ఈ మ్యాచ్ కోసం భారత్ ఒక మార్పు చేసింది. సిరాజ్ స్థానంలో కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వచ్చాడు. అఫ్గానిస్తాన్ కూడా ఒక మార్పు చేసింది. ఖరీమ్ జన్నత్ స్థానంలో హజ్మతుల్లా తుది జట్టులోకి వచ్చాడు.

తుది జట్లు

టీమిండియా

రోహిత్ శర్మ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, అర్ష్ దీప్ సింగ్

అఫ్గానిస్తాన్

రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మతుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, హజ్రతుల్లా జజాయ్, గుల్బదీన్ నైబ్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మొహమ్మద్ నబీ, నజిబుల్లా జద్రాన్, నూర్ అహ్మద్, నవీన్ ఉల్ హక్, ఫజల్లా ఫరూఖీ

# బాల్కనీ నుంచి కిందపడి.. భారత మాజీ క్రికెటర్ మృత్యువాత

భారత మాజీ క్రికెటర్ డేవిడ్ జాన్సన్ కన్నుమూశాడు. 52 ఏండ్ల వయసున్న డేవిడ్ ప్రమాదవశాత్తూ మృత్యువాతపడ్డాడు. గురువారం బెంగళూరులోని సొంత అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్థు బాల్కనీ నుంచి కింద పడ్డాడు. దాంతో, తీవ్రగాయాలపాలైన ఆయన్ను కుటుంబసభ్యులు వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కానీ, దారిలోనే ఆయన ప్రాణాలు విడిచారని డాక్టర్లు తెలిపారు. డేవిడ్ మరణవార్తను కర్నాటక క్రికెట్ అసోసియేషన్ ధ్రువీకరించింది. 'డేవిడ్ తన ఇంటి అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్థు బాల్కనీ నుంచి కింద పడ్డాడు. తీవ్రగాయాలపాలైన ఆయన్ను దవాఖానకు తీసుకెళ్లారు. కానీ, అప్పటికే డేవిడ్ మరణించారని వైద్యులు వెల్లడించారు' అని కర్నాటక క్రికెట్ సంఘం ఓ ప్రకటనలో చెప్పింది.

డేవిడ్ జాన్సన్

డేవిడ్ ఇక లేరనే విషయం తెలియగానే దిగ్గజ బౌలర్ అనిల్ కుంబ్లే విస్మయం వ్యక్తం చేశాడు. 'నాతో క్రికెట్ ఆడిన స్నేహితుడు మరణించారనే వార్తను విని ఎంతో బాధపడుతున్నా. చాలా తొందరగా వెళ్లిపోయావ్ 'బెన్నీ" అని కుంబ్లే తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చాడు. ఫాస్ట్ బౌలర్ అయిన డేవిడ్ జాన్సన్ 19996లో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. అయితే.. ఆయన ఆడింది రెండంటే రెంటే టెస్టులు. ఈ రెండు మ్యాచుల్లో డేవిడ్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాక ఆయన క్రికెట్ అకాడమీ మొదలెట్టారు. దేశానికి భావి క్రికెటర్లను అందించాలనే ఉద్దేశంతో పనిచేశారు. అయితే.. గత కొన్నాళ్లుగా డేవిడ్ ఆరోగ్యం బాగాలేదు. ఈ సమయంలోనే ఆయన బాల్కనీ నుంచి కిందపడి మరణించడంతో అంతా షాక్‌కు గురయ్యారు. బీసీసీఐ సెక్రటరీ జై షా, ప్రధాన కోచ్ చేపట్టబోతున్న గౌతం గంభీర్‌లు ఎక్స్ వేదికగా డేవిడ్ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.



Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**